

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV — STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 06 | సంచిక 149 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 26, ఏప్రిల్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# చదువుల ఫీజులు చెల్లించేది ఎప్పుడు !






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**పాత బకాయిల విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్స్ పక్కనపడ్డాయి**

**గత ప్రభుత్వ ఫీజుల బకాయిలు నేటికీ మంజూరు కాలేదు**

**నేటి ప్రభుత్వ ఫీజుల బకాయిలు కూడా విడుదల చేయకపోవడం విడ్డూరం**

**ప్రభుత్వ విద్యా బలపడుతుంది ఫీజులేమో భారమౌతున్నాయి**

**ఫీజులు కట్టలేక చదువులు మానేస్తున్న విద్యార్థులు**

**ప్రభుత్వ విద్యా సంస్థల్లో కోర్సుల ఫీజులను అడ్డగోలుగా పెంచి కూర్చున్నారు**

**ప్రభుత్వ విద్య ప్రైవేట్ వ్యాపారానికి కారకులు ఎవరు**

**ప్రభుత్వ విద్యపై ముందు చూపుతో ముందుకు సాగుస్తున్న ప్రభుత్వానికి ఫీజుల బకాయిల మచ్చ**

**పేద విద్యార్థులను ఆదుకునేది ఎన్నడు**

**అన్ని దానాల కన్నా విద్యా దానం గొప్పది**

**సీఎం సార్ ప్లీజ్ మాకు ఫీజు రియంబర్స్మెంట్స్ పెండింగ్ బకాయిలు విడుదల చేయండి**

**రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి పెను సవాల్ గా మారిన పేద విద్యార్థుల భవిష్యత్తు : డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ విద్యకు ఆటంకాలు సృష్టించబడి మార్గమధ్యలోనే విద్యాభ్యాసాన్ని మానేయాల్సిన పరిస్థితిలు ఏర్పడ్డాయని డాక్టర్ బరిగెల శివ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. గత ప్రభుత్వంలోని రెండు సంవత్సరాల కాలం పాటు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉండగా నేటి ప్రభుత్వంలో 16 నెలలు గడుస్తున్నప్పటికిని ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు,విద్యాసంస్థలు, కళాశాలలు,బడుగు బలహీన వర్గాల పేద బిడ్డల విద్యార్థులను ఫీజులు చెల్లించవలసిందేనట్టు హుకుం జారీ చేస్తుండడంతో పాటు పరీక్షలు రాయనివ్వకుండా తీవ్ర మనోవేదనకు గురిచేస్తూ మార్గమధ్యలోనే విద్యార్థులు తమ విద్యను మానివేసే విధంగా చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. సుమారు మూడు లక్షల కోట్ల రూపాయలు రాష్ట్ర బడ్జెట్లో ప్రవేశపెట్టబడగా సుమారు 23 వేల కోట్ల రూపాయలు విద్యాశాఖకు కేటాయించబడినాయన్నారు. అలాంటప్పుడు విద్యారంగ సంస్థలకు విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించడంలో వైఫల్యాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. 23 వేల కోట్ల రూపాయలు అసెంబ్లీ సాక్షిగా మంజూరు చేయబడగా పాతవి, కొత్తవి కలుపుకొని సుమారుగా 8000 కోట్ల వరకు విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని వాటిని చెల్లించడంతో ప్రభుత్వం పేద విద్యార్థులపై కన్న తండ్రి ప్రేమను చూపించడంలేదన్నారు. నిరుపేద విద్యార్థులు కేవలం ప్రభుత్వ విద్యతోనే పైకి రావాలని కోరుకుంటున్న సందర్భాల్లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో

- మిగతా 2లో..

## ఉగ్రదాడకి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**ర్యాలీలో పాల్గొన్న సిఎం తదితరులు**

**హైదరాబాద్,ఏప్రిల్25(జై భీమ్ న్యూస్) :**




పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవాలని భారత్ ముక్తకంఠంతో నినదిస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పాక్ పై దౌత్య పరమైన దాడికి తెరలేపింది. దేశం మొత్తం పాక్ కు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తోంది. ముష్కరుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్గౌడ్, ఎంపి ఒవైసీ, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్, ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.. ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి.. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పర్యాటకులపై దాడి చేసి చంపడం తీవ్రమైన ఘటన.. అందరం ఒక్క-టై తీవ్రవాదంపై పోరాడాలి.. భారత ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు మద్దతు ఇవ్వాల్సిన సమయం ఇది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.. దాడులకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలి.. పార్టీలకు అతీతంగా పని చేయాలి.. తీవ్రవాదాన్ని అంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## కస్తూరి రంగన్ సేవలు నిరుపమానం

**నివాళి అర్పించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,ఏప్రిల్25(జై భీమ్ న్యూస్):**

ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ మృతి పట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో కస్తూరి రంగన్ విశేష సేవలు అందించారని ఆయన గుర్తు చేసుకున్నారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో చైర్మన్గా, ముఖ్యంగా పిఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఆయన పోషించిన పాత్ర దేశం మరిచిపోదని సిఎం పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, జేఎన్యూ వైస్ ఛాన్స్లర్గా, కేంద్ర ప్రభుత్వ అంతరిక్ష విభాగం కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం సభ్యుడిగా అనేక పదవుల్లో విశేష సేవలు అందించిన డాక్టర్ కస్తూరి రంగన్ మృతి దేశానికి లోటని, ఒక గొప్ప ఖగోళ శాస్త్రవేత్తను దేశం కోల్పోయిందని సిఎం రేవంత్ పేర్కొన్నారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని సిఎం రేవంత్ ప్రార్థించారు. వారి కుటు-ంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతిని తెలియజేశారు.



## నోవాటెల్లో భారత్ సమ్మిట్ ప్రారంభం

**సమ్మిట్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,ఏప్రిల్25(జై భీమ్ న్యూస్):**



హెచ్ఐసీసీలోని నోవాటెల్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' జరుగుతోంది. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. భారత్ సమ్మిట్కు వచ్చిన విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కళాకారులు, పలువురు కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. బోనాల డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సదస్సుకు వారిని ఆహ్వానించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీ ప్రతినిధులు మంత్రముగ్ధులయ్యారు. భారత్ సమ్మిట్ - 2025 లో డెలిగేట్స్ సదస్సులో సమాచార పౌర సంబంధాలు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిపాల్గొన్నారు. ఎంపీ లు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఫీన్ ల్యాండ్, థాయ్ లాండ్, బ్రిటన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి దిగ్విజయ్ సింగ్ ఈ.సదస్సుకు సమన్వయ అధికారిగా వ్యవహరించారు.



## సిద్దిపేటకు తెలంగాణకు పేగుబంధం

**ఆనాడు కెసిఆర్ ఇక్కడి నుంచే కదిలారు**

**యువత ర్యాలీని ప్రారంభించిన హరీష్ రావు**

2

## కేంద్ర నిర్ణయానికి సంపూర్ణ మద్దతు

**ప్రధాని మోడీతో సిఎం చంద్రబాబు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్25(జై భీమ్ న్యూస్):**

పహల్గాం దుర్ఘటననేపథ్యంలో కేంద్రం తీసుకునే ఎటువంటి చర్యలకైనా తమ మద్దతు ఉంటుందని, దీనికి కట్టుబడి ఉన్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన ప్రధాని మోడీతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మే 2వ తేదీన ఏపి రాజధాని అమరావతి పునర్నిర్మాణం పనులకు శంఖుస్థాపన కార్యక్రమం జరగనుంది.. ఈ శంఖుస్థాపన చేసేందుకు రావాలని ప్రధానికి సీఎం చంద్రబాబు ఆహ్వానం పలికారు. గత బడ్జెట్ సమావేశాల్లో ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం 15 వేల కోట్ల రూపాయలు సమకూర్చనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. కాగా, లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా అమరావతి పునర్ నిర్మాణానికి తోడ్పాటు-ను అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కాగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సీఎం చంద్రబాబు భేటీ- ముగిసింది. ఇరువురు మధ్య సుమారు గంట పాటు- కీలక చర్చలు జరిగాయి. పెహల్గామ్ ఉగ్రదాడి, తదనంతర పరిణామాలపై ఇరువురు నేతల మధ్య చర్చ కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు, నిర్ణయాలకు ఏపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధానికి సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు.



## సెలవులతో యాదగిరిగుట్టలో పెరిగిన రద్దీ

**యాదగిరిగుట్ట, ఏప్రిల్25(జై భీమ్ న్యూస్):**



యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ బాగా పెరిగింది. సెలవుల కారణంగా భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. దీంతోఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేసవి సెలవుల దృష్ట్యా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. ప్రసాద విక్రయశాల, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండకింద విష్ణు పుష్కరిణి, కారు పార్కింగ్, బస్టాండ్ ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. మరోవైపు జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తుగా దేవస్థానం తమ భద్రతా బలగాలను అప్రమత్తం చేసినట్లు ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.

జై భీమ్ POWER OF PEOPLE

# చదువుల ఫీజులు "చెల్లించేది "ఎప్పుడు

మొదటి పేజీ తరువాయి

కూడా అధికారులు ఫీజులు చెల్లించవలసిందేనంటు విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజుల బకాయిలను విద్యార్థులపై రుద్దడం సరైంది కాదన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించకుండా అడ్డుపడడంలో ప్రధాన కారణం ఫీజుల చెల్లింపెనన్నారు. విద్యార్థులను సకాలంలో ఆదుకొని న్యాయం చేయాల్సిన ప్రభుత్వాలు కాలయాపన చేస్తుండడం వల్ల పేద విద్యార్థులను ఆదుకోలేకపోతుందన్నారు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులను ఫీజుల చెల్లింపు విషయంలో తెగ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బహుజన విద్యార్థి బిడ్డలకు తీరని అన్యాయం జరుగుతున్నప్పటికీ గత ప్రభుత్వం మాదిరిగానే నేటి ప్రభుత్వం సకాలంలో ఫీజులు చెల్లించే బాధ్యతను చేపట్టకపోవడం అత్యంత బాధాకరమన్నారు. సుమారు మూడు లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్లో విద్యార్థులు చదువులకు కేటాయించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలే కరువయ్యాయా అంటూ సూటిగా అడిగారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తామంటూ లక్షలాది మంది విద్యార్థులను ఇబ్బందులు పెడుతూ రోడ్డున పడేస్తున్న విద్యాసంస్థలకు సమాధానం చెప్పేది ఎవరున్నారు. ఉన్నత విద్య అభివృద్ధి అంటే కేవలం విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉంటుందని అలాంటి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తు నిర్ణయాన్ని నిర్ధారించుకునేది ఉన్నత విద్యతోనేనన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతూ తెలంగాణను అభివృద్ధి పథంలోనికి నడిపిస్తున్నప్పుడు విద్యార్థుల ఫీజులు చెల్లించకుండా, విద్యార్థుల ఫీజుల చెల్లింపుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేద విద్యార్థులు కంటతడి పెట్టుకుంటున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యమో విద్యాసంస్థల తిరుగుబాటు తనమో తెలియదు గానీ రాష్ట్రమంతా ఇటు ప్రభుత్వం అటు ప్రైవేటు విద్యాసంస్థలలో కోర్సుల ఫీజులు విపరీతంగా పెంచేసి పేద విద్యార్థుల విద్యా జీవితాలను వెనుకబాటు తనానికి చేరువయ్యేలా చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఒక్క విద్యార్థి కనీసం 5 నుండి 10 మంది వ్యక్తులను ప్రభావితం చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నారన్నారు. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాల్సింది విద్యార్థులేనంటూ మరొకసారి గుర్తుచేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తూ ఆదుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు న్యాయం జరిగించే విధంగా పాత ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలను చేపట్టిందని భావించిన తెలంగాణ విద్యార్థి యువత కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారన్నారు. నేటి ప్రభుత్వం అదే తరహా ద దోరణిని ప్రదర్శిస్తూ విద్యార్థులు కట్టాల్సిన కోర్సుల ఫీజులు చెల్లించకపోవడం ఇంచుమించు విద్యావ్యవస్థను అణిచివేసే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని విద్యార్థి లోకం బలంగా భావిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా తక్షణమే పేద విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించి విద్యార్థులను మోస్తారుగా ఆదుకోవాలని తెలంగాణ పేద విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కోరుతూ సహాయం చేయాలని అడుగుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నత అధికారులకు పేద విద్యార్థుల ఫీజులు చెల్లించాల్సిన బాధ్యతను ప్రభుత్వానికి గుర్తుచేసే బాధ్యతను మర్చిపోయారని విద్యార్థులకు ప్రశ్నిస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించడంలో అధికారుల తీరు ప్రభుత్వ తీరుకు సరిపోవడం లేదన్నారు ఇకనైనా తక్షణమే పాత ఫీజుల బకాయిలతో పాటు కొత్త ఫీజుల బకాయిలను చెల్లిస్తూ పేద విద్యార్థులకు సరైన రీతిలో న్యాయం చేసి విద్యా పురోగతిని, విద్యాభివృద్ధి పురోగతిని,పేద విద్యార్థుల జీవితాలను బలోపేతం చేయాలని కోరినారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజుల బకాయిల కోసం గడిచిన నాలుగు సంవత్సరాలుగా విద్యార్థి లోకం వందలాది సార్లు ధర్నాలు రాస్తారోకోలు ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడిలు నిర్వహిస్తూ సాఫీగా సాగాల్సిన విద్యా సంవత్సరాలను చేదరగొట్టుకున్నారన్నారు. వేలాది మంది విద్యార్థులపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లో లెక్కిలీలన్నీ కేసులు అయ్యాయన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు రక్షణగా నిలవాలని కోరినారు.

## 'ముద్రాపోర్టు' హెరాయిన్‌కు ఎల్‌ఇటితో లింక్

**సుప్రీంకోర్టులో ఎన్‌ఐఎ వెల్లడి**



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఇతర బిజెపి పెద్దలకు అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీ గ్రూపునకు చెందిన గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో గతంలో పట్టుబడిన డ్రగ్స్‌కు పాక్ కేంద్రంగా పనిచేస్తున్న నిషేదిత ఉగ్రవాద సంస్థ 'లష్కరే ఎ తోయిబా' (ఎల్‌ఇటి)కి సంబంధమున్నట్లున్న జాతీయ నిఘా సంస్థ (ఎన్‌ఐఎ) వెల్లడించింది. 2021 సెప్టెంబర్‌లో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్‌ఐ).. ముంద్రా పోర్టులో 2988 కిలోల హెరాయిన్ సరుకును స్వాధీనం చేసుకుంది. దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎల్‌ఇటి ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులుగా సమకూర్చటానికి ఉపయోగించారని ఎన్‌ఐఎ సుప్రీంకోర్టుకు నివేదించింది. దీంతో దేశంలో గుట్టు చప్పుడు కాకుండా జరిగే మాదకద్రవ్యాల సరఫరా విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఎన్‌ఐఎ తరపున వాదనలు వినిపించారు. ఈ కేసులో కీలక నిందితుడు ఢిల్లీకి చెందిన హర్‌ప్రీత్ సింగ్ తల్వార్ అలియాస్ కబీర్ తల్వార్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ తన వాదనలను న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కె సింగ్‌లతో కూడిన ధర్మాసనం ముందు వినిపించారు. ఈ కేసులో కీలక సాక్షుల్లో ఒకరైన రిటైర్డ్ కస్టమ్స్ అధికారి అనుమానాస్పద స్థితిలో చనిపోయారని ఎఎస్‌జీ చెప్పారు. నిందితుడు తల్వార్ తరఫున సీనియర్ న్యాయవాది సిఎ సుందరం వాదించారు. హెరాయిన్ స్మగ్లింగ్ ఆరోపణలతో ఆయనకు సంబంధం ఉన్నదని చెప్పటానికి ఎలాంటి ఆధారాలూ లేవని ధర్మాసనానికి వివరించారు. ఇరువైపులా వాదనాలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. తన తీర్పును రిజర్వ్ చేసింది.

## మహారాష్ట్రలో 32 శాతం పెరిగిన రైతుల ఆత్మహత్యలు

ముంబయి : మహారాష్ట్రలో మహాయుతి పాలన అక్కడి రైతులను తీవ్ర కష్టాల్లోకి నెడుతున్నది. మరఠ్వాడ ప్రాంతంలో అన్నదాతల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాదిలో రైతుల సూసైడ్‌లు పెరిగాయి. జనవరి నుంచి మార్చి మధ్య ఇక్కడ 269 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. డివిజనల్ కమిషనర్ కార్యాలయ నుంచి వచ్చిన నివేదిక ప్రకారం.. గతేడాది ఇదే కాలంలో 204 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ సమయంతో పోలిస్తే ఈ సారి రైతన్నల ఆత్మహత్యలు 32 శాతం పెరుగుదలను చూడటం ఆందోళనకరం. మరఠ్వాడలోని 8 జిల్లాల్లో.. బీడ్‌లో ఈ కేసులు అత్యధికంగా పెరిగాయి. 2025 మొదటి మూడు నెలల్లో ఈ జిల్లాలో 71 మంది రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. 2024లో ఆ సంఖ్య 44గా ఉన్నది. ఛత్రపతి శంభాజీనగర్‌లో జనవరి-మార్చి మధ్య కాలంలో 50 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నాందేడ్‌లో ఈ సంఖ్య 37, పర్భానీలో 33, ధరాశివ్‌లో 31, లాతూర్‌లో 18, హింగోలిలో 16, జాల్నాలో 13 మంది రైతు ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. రైతుల ఆత్మహత్యల విషయంలో అక్కడి బిజెపి నేతృత్వంలోని మహాయుతి సర్కారుపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. లోక్‌సభ మాజీ ఎంపీ, రైతు బృందం షెట్కారి సంఘటన చీఫ్ రాజు శెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందనీ, కానీ దానిని పాటించలేదని ఆయన అన్నారు. ఇది మోసపు చర్యగా అభివర్ణించారు. 2001 నుంచి మహారాష్ట్రలో 39,825 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఒక ప్రముఖ ఆంగ్ల వార్తా సంస్థ కథనం. వీటిలో 22,193 మంది రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభం కారణంగానే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నారు.

## ట్రంప్ టారిఫ్‌లపై యుఎస్ కోర్టుకు 12 రాష్ట్రాలు



వాషింగ్టన్ :అమెరికా అధ్యక్షులు ట్రంప్ విధించిన టారిఫ్‌లను రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ట్రంప్ విధించిన టారిఫ్‌లను నిలిపివేయాలని కోరుతూ 12కి పైగా రాష్ట్రాలు న్యూయార్క్‌లోని యుఎస్‌కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌ను ఆశ్రయించాయి. టారిఫ్‌లు చట్టవిరుద్ధమని, అమెరికా ఆర్థిక వ్యవస్థలో గందరగోళం సృష్టించాయని మండిపడ్డాయి. అమెరికా అధ్యక్షులు ట్రంప్ అమలు చేసిన విధానం చట్టబద్ధంగా అధికారాన్ని వినియోగించడానికి బదులుగా ఇష్టానుసారంగా వ్యవహరించినట్లుగా ఉందని దావాలో తెలిపాయి. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం ఆధారంగా తాను ఏకపక్షంగా సుంకాలు విధించవచ్చన్న ట్రంప్ వాదనను ఈ వ్యాజ్యం సవాలు చేసింది. సుంకాలు చట్టవిరుద్ధమని ప్రకటించాలని, ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు వాటిని అమలు చేయకుండా నిరోధించాలని కోర్టును కోరాయి. ఒరెగాన్ , అరిజోనా, కొలరాడో, కనెక్టికట్, డెలావేర్, ఇల్లినాయిస్, మయినె, మిన్నెసోటా, నెవాడా, న్యూమెక్సికో, వెర్మోంటో, న్యూయార్క్ రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ టారిఫ్ పథకం పిచ్చిపట్టిన విధానం అని అరిజోనా అటార్నీ జనరల్ క్రిస్ మేయస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ఆర్థిక నిర్లక్ష్యమే కాకుండా చట్టవిరుద్ధమని అన్నారు. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని, అత్యవసర పరిస్థితి విదేశాల నుండి అసాధారణమైన మరియు తీవ్రమైన ముప్పు ఎదురైనపుడు మాత్రమే అమెరికా అధ్యక్షులు అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని అమలు చేయగలరని వాదించారు. టారిఫ్‌ల విధింపుతో అధ్యక్షులు రాజ్యాంగ క్రమాన్ని ఉల్లంఘించారని, ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థలో గందరగోళానికి దారితీసిందని పేర్కొన్నారు. గతవారం కాలిఫోర్నియాలోని యుఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో ట్రంప్ విధానాలపై డెమోక్రాట్ నేత, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ దావా వేసిన సంగతి తెలిసిందే. దేశంలో అతిపెద్ద దిగుమతి దారుగా ఉన్న తన రాష్ట్రం బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోనుందని పేర్కొన్నారు.

## గగన తలాన్ని మూసివేసిన పాక్

ఇస్లామాబాద్ : పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న చర్యలు, నిర్ణయాలపై పాకిస్తాన్ గురువారం స్పందించింది. ప్రతిగా పలు చర్యలను ప్రకటించింది. భారత్‌కి చెందిన విమానాలేవీ ప్రవేశించకుండా గగనతలానిన మూసివేస్తునట్లు తెలిపింది. ఈ మేరకు ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఓ) ఒక ప్రకటన జారీ చేసింది. భారత్‌తో గల వాణిజ్య, ద్వైపాక్షిక, గగనతల ఒప్పందాలన్నింటినీ నిలుపుచేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అలాగే 1972 నాటి సిమ్లా ఒప్పందాన్ని కూడా నిలుపు చేసింది. భారత్‌తో గల వాఘా సరిహద్దును తక్షణమే మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మార్గం ద్వారా భారత్ నుండి వచ్చే రవాణా అంతా కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. చట్టబద్ధమైన పత్రాలతో సరిహద్దు దాటిన వారు ఏప్రిల్ 30లోగా వెనక్కి రావాలని గడువు విధించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం (ఎస్‌విఇఎస్) కింద భారతీయులకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దు చేసింది. వాటి రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించింది. 48 గంటల్లోగా వారు దేశం వీడాలని పేర్కొంది. అయితే సిక్కు యాత్రికుల వీసాలను మినహాయించింది. అలాగే దౌత్య సిబ్బందిని కూడా 30కి కుదించింది. భారత్ చర్యలపై సమీక్షించేందుకు గురువారం ఇస్లామాబాద్‌లో జరిగిన జాతీయ భద్రతా కమిటీ (ఎన్‌ఎస్‌సి) సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రక్షణ, విదేశాంగ, హెూం మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారు, త్రివిధ దళాల చీఫ్‌లు, ప్రభుత్వ, సైనిక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బుధవారం భారత ప్రభుత్వం ప్రకటించిన చర్యలను సమీక్షించింది. ఆ చర్యలను ఏకపక్షమైనవని, అన్యాయమైనవని, రాజకీయ దురుద్దేశపూరితమైనవని వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ ఒప్పందాలను పట్టించుకోకుండా, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలను విస్మరించి భారత్ వ్యవహరించిన ఈ తీరు బాధ్యతారాహితంగా వుందని విమర్శించింది.

## టెర్రర్ క్యాంప్‌లను ఏరివేయండి



న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడులు జరగడానికి భద్రతా వైఫల్యాలే ప్రధాన కారణం అని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అంగీకరించారు. దాడుల విషయంలో భద్రతా బలగాలు నిర్లిప్తత , ఇంటలిజెన్స్ వర్గాల పర్యవేక్షణా లోపాలు ఉన్నాయనే వాదనల నేపథ్యంలోనే గురువారం ఇక్కడ అఖిలపక్ష భేటీ జరిగింది. కేంద్ర ప్రభుత్వం త క్షణం స్పందించి టెర్రర్ క్యాంప్‌లను ఏరివేయాలని సమావేశంలో పార్టీలకు అతీతం గా నేతలు అంతా పిలుపు నిచ్చారు. నిర్ణయాత్మక చర్యలు తప్పనిసరి, ఉదాసీనత పనికిరాదని వివరించారు. ప్రస్తుత పరిస్థితిని సమీక్షించుకునేందుకు, తదుపరి చర్యల ఖరారుకు అఖిల పక్ష సమావేశాన్నిరహస్యంగా నిర్వహించారు. లోపాలు జరిగినందునే ఇప్పుడు మనం అంతా కలిసి కూర్చుని పరిస్థితిని సమీక్షించుకుంటున్నామని , అంతా సవ్యంగా ఉంటే ఇక ఇటువంటి భేటీల అవసరం ఏముంటుందని విపక్షాలపై ఆయన సున్నితంగా విమర్శలకు దిగారు. ఎంత జాగ్రత్తగా వ్యవహరించినా ఎప్పుడో ఒక్కసారి , ఏదో ఓ చోట అవాంఛనీయ ఘటనలు జరుగుతాయి. పహల్గామ్ తరహా దాడికి తావుండదని భావిస్తూ వచ్చి ఉంటామని, అదును చూసుకుని ఉగ్రవాదులు రెచ్చిపొయ్యారని ఆయన తెలిపారు. ప్రభుత్వ వివరణ తరువాత ప్రతిపక్షాలు ప్రభుత్వానికి తామంతా తోడుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితిని సమావేశానికి వచ్చిన వివిధ పార్టీల నేతలు అడిగి తెలుసుకున్నారు. ఉగ్రవాద చర్యలకు గట్టి జవాబు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ దిశలో తామంతా ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తామని సమావేశానికి వచ్చిన కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ చెప్పారు. ప్రతిపక్షాలన్ని కూడా పహల్గామ్ దాడులను ఖండిస్తున్నాయి. దాడులకు కారకులు అయిన వారిని గుర్తించడం,తెరెనుకున్న శక్తులను కనగొని చర్యలు తీసుకోవడం అత్యవసరం అన్నారు. చిరకాలంగా చితికిపోతున్న కశ్మీర్ పట్ల దేశం యావత్తూ ఆవేదన చెందుతోంది. ప్రత్యేకించి ఇక్కడ శాంతియుత వాతావరణం నెలకొనేలా చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ చర్యలకు తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ శు క్రవారం అనంత్‌నాగ్‌లో పర్యటిస్తారని పార్టీ అధ్యక్షులు ఖర్గే ఆ తరువాత మీడియాకు తెలిపారు. ఉగ్రవాదంపై తీవ్రస్థాయి పోరు తప్పదు. ఈ దిశలో దేశం అంతా కలిసికట్టుగా వ్యవహరించాల్సి ఉందని టిఎంసి ఎంపి సుదీప్ బందోపాధ్యాయ చెప్పారు.

## మధుసూధన్ రావు కుటుంబ సభ్యులకు పరామర్శ

**తన గుండె చెదరిందనన్న నటి అనన్య నాగళ్ల**



**నెల్లూరు,ఏప్రిల్ 25(ఆరెన్ఎ) :**


సినిమా పరిశ్రమనుంచి పవన్ తప్ప ఎవ్వరూ పహల్గామ్ బాధితుల ఇళ్లకు వెళ్లలేదు. కానీ, హీరోయిన్ అనన్య నాగళ్ల మాత్రం నెల్లూరు కావలిలో ఉన్న మధుసూదనరావు ఇంటికి వెళ్లింది. మధుసూదనరావు కుటుంబసభ్యుల్ని పరామర్శించింది. మధుసూదనరావు పార్థివదేహానికి నివాళులు అర్పించింది. అనంతరం అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడింది. మీడియా ప్రతినిధులతో మాట్లాడిన తర్వాత అక్కడినుంచి వచ్చేసింది. గురువారం ఇందుకు సంబంధించి తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో పహల్గామ్ ఘటన గురించి చెబుతూ ఎమోషనల్ అయింది. పహల్గామ్ సంఘటన నాకెంతో బాధను కలిగించింది. ఈ రోజు నేను ఒక ఈవెంట్ కోసం నెల్లూరుకి వచ్చాను. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వ్యక్తి నెల్లూరు పక్కన కావలి అని తెలుసుకొని చూసేందుకు వచ్చాను. మతం పేరు తెలుసుకుని మరీ చంపేయడాన్ని నేను తీసుకోలేకపోతున్నాను. మధుసూదనరావు గారి ఆత్మకు శాంతి కలగాలి. వారి కుటు-ంబానికి దేవుడు మనోధైర్యం ప్రసాదించాలి. భారత యువతగా మనం ఇలాంటి ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండించాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు మన ప్రభుత్వం దృఢమైన చర్యలు తీసుకోవాలని కోరుకుంటు-న్నాను' అని పేర్కొన్నారు. నివాళులు అర్పిస్తున్న ఫొటోను, మీడియాతో మాట్లాడుతున్న ఫొటోను కూడా పోస్టులో షేర్ చేశారు.

## సిద్ధిపేటకు తెలంగాణకు పేగుబంధం

**ఆనాడు కెసిఆర్ ఇక్కడి నుంచే కదిలారు**

**యువత ర్యాలీని ప్రారంభించిన హరీష్ రావు**

**సిద్దిపేట,ఏప్రిల్ 25(ఆరెన్ఎ):**



తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నేడు విద్యార్థులు, యువత చేపట్టిన పాదయాత్ర రేపు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి విజయ యాత్రగా కాబోతున్నదని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాంపల్లి అమర వీరుల స్థూపం నుంచి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత చేపట్టిన పాదయాత్రను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నాడు సిద్దిపేట నుంచే కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్లు కదిలించారని గుర్తుచేశారు. చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి.. కానీ బీఆర్ఎస్ మాత్రం లక్ష్యాన్ని ముద్దాడిందని తెలిపారు. కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందన్నారు. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం.. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షమేనని స్పష్టం చేశారు. లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామదండు కదిలింది. నేడు మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందని చెప్పారు. 'కాశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుంచి పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నా. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది ఈనెల 27న వరంగల్‌లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

## సంపాదకీయం

# అసలైన సంపద మేధో సంపత్తి

"మానవాళి ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు ఒకే విధమైన పరిష్కారం అసాధ్యమని, ప్రతి సమస్య పరిష్కారంలో సృజనశీల ఆలోచనలు జోడిస్తే సరళ మార్గాలు ఆవిష్కరించబడి ఉత్తమ ఫలితాలు సుసాధ్యమని" ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ తెలపడం మేధావి వర్గం గుర్తుచేసుకోవాలి. ఈ దిశగా మేధో సంపత్తిని గుర్తించడం, ప్రోత్సహించడం, సంపత్తి హక్కులను కాపాడడం, సమాజోన్నతికి వినియోగించడం ఆయాదేశాల కనీస బాధ్యతగా తెలుసుకోవాలి. నేటి సృజనశీల ఆవిష్కరణలు రేపు పాతబడిపోతున్నాయి. శాస్త్రసాంకేతిక విప్లవం నిత్యనూతనంగా కొత్తపొంతలు తొక్కుతున్నది. నాడు ట్రాంకాల్ ద్వారా దూరప్రాంత ప్రజలతో మాట్లాడిన రోజుల నుంచి నేడు క్షణాల్లో స్మార్ట్‌ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా చూస్తూ మాట్లాడుకునే డిజిటల్ కాలానికి వచ్చాం. రేపు ఏ ఆవిష్కరణ మన జీవనశైలినా ఏ విధంగా మార్చనుందో ఊహకు అందడం లేదు. ఇలా మానవ జీవనశైలిలో పెను మార్పులు రావడానికి మేధో సంపత్తి పునాదిగా నిలుస్తున్నది. మేధావుల సృజన, వినూత్న ఆవిష్కరణల దాహంతో పలు అత్యాధునిక శాస్త్రసాంకేతిక ఉపకరణాలు మనల్ని అబ్బురపరుస్తూ మన జీవినశైలిలో ఓ భాగం అవుతున్నాయి. వంటింటి నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు నిరంతరం కొనసాగుతున్నాయి. అత్యంత శక్తివంతమైన మేధో సంపత్తి (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ) ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 26 ఏప్రిల్ రోజున "ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం (వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ డే)" పాటించడం 26 ఏప్రిల్ 2000 నుంచి ప్రారంభమైంది. 2025 ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవ ఇతివృత్తంగా "మేధో సంపత్తి – సంగీతం : ఐపి బీట్‌ను అనుభూతి చెందండి" అనబడే అంశాన్ని తీసుకున్నారు. పేటెంట్లు, కాపీరైట్స్, ట్రేడ్ సీక్రెట్స్, డిజైన్స్, సంగీత రంగంలో సృజనలు, భౌగోళిక సూచికలు లాంటివి మోధో సంపత్తి కిందికి వస్తాయి. సృజనశీల ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలతో మేధావులు చేస్తున్న కృషి అనన్యసామాన్యం, అభినందనీయం. మేధో సంపత్తి పట్ల అవగాహన, ప్రోత్సాహం, మేధో హక్కుల పరిరక్షణ ప్రాధాన్యం, మేధో సంపత్తిని అక్రమంగా వాడుకునే అక్రమార్కులకు జైలు ఊచల రుచి చూపడం, మేధో హక్కుల విశ్లేషణలు, విస్తృత ప్రచారం, మేధో సంపత్తి సంబంధ చట్టాల అవగాహన, న్యాయపరమైన వివరాలు, ఆవిష్కరణలకు సరైన గుర్తింపు లాంటివి ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవ వేదికగా చర్చించబడతాయి. మేధో సంపత్తిలో ఓ ప్రధాన భాగంగా సాహిత్యం, సంగీతం, కళా సృజన, సినిమా, సింబల్స్, ఇమేజెస్, పేర్లు, వాణిజ్యపరమైన అంశాలు అనేకం వస్తాయి. మేధో సంపత్తి రక్షణ, విక్రయ బాధ్యతలు ఆవిష్కర్తకు మాత్రమే ఉంటాయి. మేధో సంపత్తి ఒక్కరిది లేదా సమూహానిది అయినప్పటికీ అందరికీ సమాన హక్కులు కల్పించబడతాయి. మేధో సంపత్తిని విక్రయించడం, లైసెన్స్ తీసుకోవడం, దానం చేయడం, వినిమయం చేయడం లాంటి సర్వాధికారాలు ఆవిష్కర్తలకు మాత్రమే ఉంటాయని తెలుసుకోవాలి. దేశాభివృద్ధి మేధో సంపత్తి మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. మేధో సంపత్తి హక్కులు అధికంగా యూఎస్, యూకె లాంటి దేశాల్లో అధికంగా నమోదు అవుతున్నాయి మేధో సంపత్తి హక్కుల వల్ల సామాన్యులపై ఆర్థిక భారం పడడం, అమలులో జాప్యాలు జరగడం, వినియోగదారులపై పెను భారం పడడం జరుగుతుందని వాదనలు చేయలేదు వర్గాలు ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని వ్యతిరేకిస్తున్నారని కూడా తెలుసు కోవాలి. పర్యావరణ హితమైన మేధో సంపదలకు నేడు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది. వినూత్న ఆవిష్కరణలు మానవాళి జీవన విధానాలను సరళతరం చేస్తున్నాయి, సుఖసంతోషాలకు పునాదులు నిలుస్తున్నాయి. నేటి యువత స్టెమ్ (సైన్స్ – టెక్నాలజీ – ఇంగ్లీష్/ఇంజనీరింగ్ – మ్యాథమ్యాటిక్స్) ఆధారంగా తమ పరిశోధనలతో విలువైన మేధో సంపత్తిని జనింపజేసి ఆచరణాత్మక మార్గాలను చూపుతూ ప్రపంచ మానవాళికి బహుమతులుగా అందజేయాలని కోరుకుందాం, మన భారతం కూడా ఐపి రంగంలో ముందంజలో ఉండాలని కోరుకుందాం.

## ఏకపక్ష ధోరణులు, టారిఫ్‌లతో శాంతి సుస్థిరతలకు ముప్పు

ఏకపక్ష వాదం, టారిఫ్‌లు వంటి చర్యల వల్ల అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకూ ముప్పు పొంచి వుందని దేశాలు హెచ్చరించాయి. వీటి ప్రభావం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై వుంటుందని, కానీ అది అక్కడికే పరిమితం కాదని పేర్కొన్నాయి. బుధవారం ఇక్కడ జరిగిన ఐక్యరాజ్య సమితి సమావేశంలో 80కి పైగా దేశాల ప్రతినిధులు దీనిపై ఆందోళనలు వ్యక్తం చేశారు. ఈ ఏకపక్ష వాణిజ్య చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు గ్లోబల్ సౌత్ పేర్కొంది. ఇలాంటి చర్యల వల్ల తీవ్రంగా దెబ్బతినేది వర్ధమాన దేశాలేనని పేర్కొంది. టారిఫ్‌లతో సహా ఇలా ఏకపక్ష వాణిజ్య చర్యలు పెరుగుతుండడమనేది కొత్త రకం 'ఆర్థిక, రాజకీయ బలవంతపు' చర్యలేనని ఐక్యరాజ్య సమితిలో వెనిజులా శాశ్వత ప్రతినిధి శామ్యూల్ మోంకాడా వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో టారిఫ్‌లు లక్ష్యిత దేశాలపై అలాగే అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, దీని పట్ల అత్యంత అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. క్యూబా ప్రతినిధి ఎర్నెస్టో గుజ్‌మన్ మాట్లాడుతూ, ఈ చర్యల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈ వాణిజ్య యుద్ధాలు, టారిఫ్‌లనేవి అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. యూరప్ దేశాలు కూడా ఇదే రీతిలో ఆందోళనలు వ్యక్తం చేశాయి. టారిఫ్‌లను విస్తరించడం వల్ల అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థకు విఘాతం కలుగుతుందని హెచ్చరించాయి. గ్రీస్, డెన్మార్క్ దేశాల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. బహిరంగ అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ అనేది ఒక ఆర్థిక సాధనం లేదా నమూనానే కాదని, బహుళపక్షవాదం పట్ల మనందరి నిబద్ధత అని డెన్మార్క్ ప్రతినిధి వ్యాఖ్యానించారు. చైనా శాశ్వత ప్రతినిధి ఫూ కాంగ్ బుధవారం నాటి సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఏకపక్ష ధోరణి పెరుగుతుండడం పట్ల హెచ్చరించారు. బెదిరింపు చర్యలు విశృంఖలంగా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల సుస్థిర అభివృద్ధి పునాది తుడిచిపెట్టుకుపోతుందని, ప్రపంచ శాంతి భద్రతలు ప్రమాదంలో పడతాయన్నారు.



# అమెరికా కౌలు రైతుల దీనగాథలు



భారత దేశంలోను, అమెరికాలోను కౌలు రైతుల చట్టాలు, సమస్యలు, భూకామందుల దోపిడీ దాదాపు ఒకే విధంగా ఉన్నాయి. అమెరికాలోని వ్యవసాయ కుటుంబాల మొత్తం జనాభా 2 శాతం మాత్రం ఉంటే, భారత దేశంలో 68% ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న వ్యవసాయ వ్యత్యాసం ఇదే. ఉద్యమాలు లేదా వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యల ఫలితంగా పాలక ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు, కౌలుదారీ చట్టాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు కౌలుదారీ చట్టాలు చేశాయి. 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1956లో చేసిన ఆంధ్రా కౌలుదారీ చట్టం, 2011లో అధీకృత కౌలుదారీ చట్టం, 2019లో వైసిపి ప్రభుత్వం తెచ్చిన పంట సాగుదార్ల రక్షణ చట్టం మొదలైనవి రైతాంగ ఉద్యమాల ఫలితంగా వచ్చినవే. ఈ అన్ని చట్టాలలోనూ కౌలు ఒప్పందం ఉండాలని, సంస్థాగత రుణాలు, పంట నష్టపరిహారాలు పొందటానికి భూయజమాని అనుమతి ఉండాలని పేర్కొన్నాయి. ఆ విధంగా కౌలుదారీ చట్టాలు అలంకారప్రాయంగా మారాయి. అమెరికాలోనూ కౌలు చట్టాలు ఈ విధంగానే ఉన్నాయి. అమెరికా వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 2017లో 90 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంటే, 2024 నాటికి 87 కోట్ల, 60 లక్షలకు తగ్గిందని, తగ్గుదల 3 శాతమని ఎకనమిక్స్ రీసెర్చ్ సర్వీసు ద్వారా తెలియచేయబడింది. 2017 వ్యవసాయ కమతాలు 20 లక్షల 40 వేలు ఉండగా, 2022 నాటికి 20 లక్షల 3 వేలకు తగ్గాయి. 2000 సంవత్సరంలో అమెరికాలో సగటు కమతం భూమి 442 ఎకరాలు కాగా, 2022 నాటికి 441 ఎకరాలకు పెరిగింది. అమెరికాలో 50 ఎకరాల కన్నా తక్కువ భూమి కలిగిన చిన్నకమతాలు 6 లక్షల, 71 వేలు ఉన్నాయి. ఈ కమతాలు సంఖ్య తగ్గటం, మధ్యస్థ భూకమతాలు కూడా తగ్గటం వలన 2 వేల ఎకరాల కన్నా ఎక్కువ భూ విస్తీర్ణం కలిగిన కమతాలు పెరిగి సగటు కమతం భూ విస్తీర్ణం పెరిగింది. సంవత్సరానికి 3 లక్షల 50 వేల డాలర్ల కన్నా తక్కువ ఆదాయం వచ్చిన కమతాలను చిన్న కమతాలు అంటారు. ఇవి మొత్తం కమతాల్లో 86% గా (10 లక్షల 72 వేలు) ఉన్నాయి. సంవత్సరానికి 10 లక్షల డాలర్ల కన్నా ఎక్కువ ఆదాయం పొందే వాటిని పెద్ద కమతాలు అంటారు. మొత్తం కమతాల్లో ఇవి 4%గా ఉన్నాయి. వీటి మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో 48 శాతంగా ఉంది. అమెరికాలో వ్యవసాయ భూమి ఎక్కువ భాగం (సుమారు 60 లేక 70%) వ్యక్తిగత లేదా కుటుంబ కమతాలుగా ఉంది. 2014 లో ఒక సర్వే ప్రకారం 96% కమతాలు కుటుంబ యాజమాన్యంలో ఉన్నాయి. ఇవి 52 కోట్ల, 80 లక్షల ఎకరాలు కలిగి ఉన్నాయి. అమెరికాలో కౌలు సేద్యం కీలక పాత్ర పోషిస్తున్నది. మొత్తం రైతుల్లో 28% అంటే 5 లక్షల, 70 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. సేద్యంలో, ఉత్పత్తిలో కౌలు రైతులు ముఖ్య భూమిక వహిస్తున్నారు. మొత్తం వ్యవసాయ భూమిలో 40 శాతం (35 కోట్ల, 30 లక్షల ఎకరాలు) కౌలు రైతులు సేద్యం చేస్తున్నారు. ఇందులో 80 శాతం ఎటువంటి వ్యవసాయం చేయని భూకామందుల భూములే ఉన్నాయి. భారత దేశంలో లాగానే అమెరికాలో కూడా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, పంట రుణాలు కౌలు రైతులకు అందటం లేదు. కౌలు ఒప్పందం కూడా సంవత్సరం లేదా అంతకన్నా తక్కువగా ఉంది. చాలా కౌలు ఒప్పందాలు ముఖ్యంగా చిన్న రైతులు చేసుకునే ఒప్పందాలు భారత దేశంలో లాగానే నోటి మాటపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల చట్టపరమైన కౌలు గుర్తింపు ఉండదు. అమెరికా వ్యవసాయ శాఖ కార్యక్రమాల్లో (సబ్సిడీలు, రుణాలు) దరఖాస్తు చేసుకునేందుకు కౌలు రైతులు ఫార్మర్ ఆపరేటింగ్ ప్లాన్ సమర్పించాలి. ఇందుకు కౌలు ఒప్పందం లేదా భూమి యజమాని నుండి లిఖితపూర్వక అనుమతి అవసరం. ఫలితంగా చాలా మంది కౌలురైతులు సబ్సిడీలు, రుణాలు పొందలేకపోతున్నారు. 2022లో అమెరికా ప్రభుత్వం రైతులకు 15.6 బిలియన్ డాలర్ల సబ్సిడీలను ప్రకటించింది. 1995 నుండి 2021 వరకు 478 బిలియన్ డాలర్ల సబ్సిడీలు పంపిణీ చేయబడ్డాయి. ఇడబ్లుజి (ఎన్విరాన్‌మెంట్ వర్కింగ్ గ్రూపు) నివేదిక ప్రకారం అందులో పైస్థాయిలో ఉన్న (పెద్ద, ధనిక కమతాలు) భూ యజమానులే 79% (సుమారు 377 బిలియన్ డాలర్లు) సబ్సిడీల రూపంలో పొందారు. అతి చిన్న కమతాలు కలిగిన 80% రైతులు కేవలం 9% సబ్సిడీలు మాత్రమే అందాయి. కౌలు రైతులు సబ్సిడీలకు అర్హులైనా చాలా సందర్భాల్లో భూయజమానులే వాటిని పొందారు. సబ్సిడీలు పొందటానికి రైతు సంవత్సర ఆదాయం 9 లక్షల డాలర్ల కన్నా తక్కువ ఉండాలి. ఈ నిబంధన ప్రకారం చిన్న రైతులకే ఎక్కువగా సబ్సిడీలు అందాలి. లిఖితపూర్వక కౌలు ఒప్పందం లేకపోవటం, భూయజమాని అనుమతి పత్రం లేకపోవటంతో కౌలు రైతులు సబ్సిడీలకు దూరంగా ఉన్నారు. అమెరికాలో నేడు కౌలు రైతులు సంక్షోభంలో ఉన్నారు. కౌలు రైతులకు సొంత భూమి లేకపోవటం, భూమిని అధిక రేటుకు కౌలుకు తీసుకోవటం, పంట ఖర్చులు పెరగటం, పండించిన పంటలకు తగిన ధరలు లభించకపోవటం, వాతావరణ మార్పులు కౌలు సేద్యం పై ప్రతికూల ప్రభావం చూపటం, సబ్సిడీలు, రుణాలు అందకపోవటం, దేశంలో ఆర్థిక మాంద్యం ఎర్పడినప్పుడు కౌలు రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపటం కౌలు సేద్య సంక్షోభానికి కారణంగా ఉంది. ఫలితంగా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. అమెరికాలోని సెంట్రల్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం వ్యవసాయం, అటవీ, మత్స్యరంగాల్లో పని చేసే వారిలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్ష మందిలో 36 గా ఉంది. ఇది సాధారణ జనాభా మరణాల రేటు (లక్షకు 14.4) కన్నా చాలా ఎక్కువగా ఉంది. 2020లో యూనివర్సిటీ ఆఫ్ ఐవోవా అధ్యయనం ప్రకారం రైతులలో వ్యవసాయ సంబంధిత వృత్తుల్లో ఉన్న వారిలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్షకు 43.7గా ఉంది. కౌలు సేద్యపు సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, కౌలురైతుల ఆందోళన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాన్ని తయారు చేస్తున్నది. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు, భూకామందులతో చేసుకునే ఒప్పందాల్లో సబ్సిడీలు, బీమా ప్రయోజనాలు పొందే హక్కును చేకూర్చేలా చేసే మార్గదర్శకాలు, ప్రభుత్వ చేసే సహాయాన్ని యజమానులు అడ్డుకోకుండా చేస్తుందని, నేరుగా కౌలురైతులు సహాయం పొందే అవకాశం కల్పిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇది ఎంతవరకు అమలు జరుగుతుంది అన్నదాని కోసం అమెరికా కౌలురైతులు ఎదురు చూడాల్సిందే. ఎందుకంటే అమెరికా ప్రభుత్వం పెద్ద భూఎస్టేట్ దారుల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడేది కావటమే. అందుకు భిన్నంగా వ్యవసాయ చట్టం ఉండదు. భూమిలేని కౌలురైతులకు అవసరం మేరకు భూపంపిణీ చేయాలి. సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, రుణాలు కౌలు రైతులకే ఎక్కువ అందాలి. పంటలకు తగిన ధరలు లభించాలి. లిఖితపూర్వక కౌలు ఒప్పందం జరగాలి. పెద్ద భూక్షేత్రాలపై భూపరిమితి విధించి మిగులు భూములు భూమిలేని కౌలురైతులకు పంపిణీ చేయాలి. ఇవి అమలు జరిగితేనే అమెరికాలో కౌలు రైతుల సమస్యలు పరిష్కరించబడతాయి. కౌలు సేద్యపు సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, కౌలురైతుల ఆందోళన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాన్ని తయారు చేస్తున్నది. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు, భూకామందులతో చేసుకునే ఒప్పందాల్లో సబ్సిడీ లు, బీమా ప్రయోజనాలు పొందే హక్కును చేకూర్చేలా చేసే మార్గదర్శకాలు, ప్రభుత్వ చేసే సహా యాన్ని యజమానులు అడ్డుకోకుండా చేస్తుందని, నేరుగా కౌలురైతులు సహాయం పొందే అవకాశం కల్పిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబు తున్నారు. ఇది ఎంతవరకు అమలు జరుగుతుంది అన్నదాని కోసం అమెరికా కౌలురైతులు ఎదురు చూడాల్సిందే. ఎందుకంటే అమెరికా ప్రభుత్వం పెద్ద భూఎస్టేట్ దారుల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడేది కావటమే.

# అసమాన శిల్పి గణపతి స్థపతి

ఆధునిక కాలంలో పలు దేవాలయాలు, అపురూప నిర్మాణాలు చూసినపుడు శిల్ప కళకు ప్రతిరూపం అయిన గణపతి స్థపతి వెంటనే స్ఫురణకు రాక మానరు. ఉలి చప్పుళ్ల మధ్య ప్రపంచంలో కళ్లు తెరిచి, ఉలి చప్పుళ్లకే జీవితాన్ని అంకితం చేసి, ఉలి చప్పుళ్ల మధ్యే కళ్లుమూసిన వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన, శిల్పీకరించిన గణపతి స్థపతి అసమాన శిల్పి. దేశం గర్వించదగ్గ శిల్పకళా నిపుణులు. హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై బుద్ధ విగ్రహం, హైదరాబాద్‌లో బిర్లా మందిర్, చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో మహానంది ఆలయ గోపురాలు, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయం, కంచి సమీప 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటపం, బద్రీనాథ్ దేవాలయ మహామండపం, తిరుమలలో వసంతరాయ మంటపం, ఇలా ఒక్కొక్క నిర్మాణంలో గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. గణపతి స్థపతి (26 ఏప్రిల్ 1931 – 7 ఏప్రిల్ 2017) ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి. పూర్తిపేరు సత్తయ్య ముత్తయ్య గణపతి. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో గణపతి స్థపతి పేరు తెర మీదకు వచ్చింది. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేత బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించప బడి, సత్కరింప బడిన గొప్పతనం ఆయనది. తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్న ప్రతిభ ఆయనది. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింప చేసిన ఘనత ఆయనది. 1931, ఏప్రిల్ 26న ముత్తు స్థపతి, గౌరీ అమ్మన్ లకు సంతానంగా జన్మించిన గణపతి, ఆరేళ్ల చిరుత ప్రాయంలోనే ఉలిని చేతబట్టి అలవోకగా చెక్కడం అభ్యాసం చేశారు. సాంప్రదాయ ఆలయ, వాస్తు, శిల్ప శాస్త్రాలను, కుటుంబ పెద్దల దగ్గర 17 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. శిల్పాలు చెక్కడం లోనూ, ఆలయాలను నిర్మించటం లోనూ కొత్త ఒరవడిని సృష్టించి, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న గణపతి తమిళనాడు వదిలి, తెలుగునాట కాలు మోపారు. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్న గణపతి స్థపతి నైపుణ్యం గురించి, విన్న నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, బద్రీనాథ్ దేవాలయ మహామండప పని అప్పగించారు. మండప భాగాలను హైదరాబాద్‌లో తీర్చిదిద్ది, బద్రీనాథ్‌కు తరలించి నిర్మించిన తీరుకు అచ్చెరువొందిన ఆమె, ఒక బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పిలుపునందుకొని, తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా చేరిన గణపతి స్థపతి, ఉమ్మడి రాష్ట్రంలో వందల, వేల ఆలయాలను నిర్మించి, ప్రధాన స్థపతిగా ఎదిగారు. తరతరాల ప్రాచీన వాస్తుశిల్ప సంప్రదాయం, నిరంతరం కొనసాగాలన్న తపనతో, తన ఆధ్వర్యంలో దేవాదాయ శాఖలో ఒక శిల్ప కళాశాలను స్థాపించి, కొన్ని వందల మంది శిల్పుల్ని తయారుచేసి, కొరతను తీర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా, శిథిలాలయాలను పదిలం చేస్తూ, లేనిచోట కొత్త వాటిని కడుతూ తలమునకలై ఉన్న గణపతి స్థపతికి శ్రీశైలం జలాశయ నీటి ముంపు దేవాలయాల తరలింపు ఒక సవాలుగా మారింది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాల్లోని 102 గ్రామాల్లో ముంపునకు గురైన దాదాపు 108 దేవాలయాలను ఊడదీసి ఎగువన1978%–%89 మధ్య చారిత్రక కార్యక్రమం చేపట్టి, పునర్నిర్మించిన ఘనతను దక్కించుకొన్నారు. వాస్తు, శిల్ప విద్యను అందుబాటు లోకి తేవడానికి పూనుకుని, తమిళ, సంస్కృత భాషల్లోనున్న వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెదపాటి నాగేశ్వరరావు సహకారంతో రూపధ్యాన రత్నావళి, కాశ్యప శిల్ప శాస్త్రాలను వెలువరించారు. నిరంతర అధ్యయనంతో పాటు, పరిశోధనలపై దృష్టి సారించిన గణపతి స్థపతి, తెలుగు విశ్వవిద్యాలయం, సచివాలయం భవనాల్లో ఆధునికతకు, సాంప్రదాయ వాస్తును జోడించి, కొత్త ఒరవడిని సృష్టించారు. ఒకసారి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు, న్యూయార్క్‌లో గణపతి స్థపతి తారస పడిన సందర్భంలో, లిబర్టీ స్టాట్యూ లాంటి పెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పే ప్రయత్నం చేయాలి అన్న ఎన్టీఆర్ కోరికను సాకారం చేసి, హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కోసం యాదగిరి గుట్టకు సమీపంలోని రాయగిరి నుంచి 100 అడుగుల రాయిని, 100 చక్రాల వాహనంపై హైదరాబాద్‌కు తరలించి, గణపతి స్థపతి ప్రపంచ ఖ్యాతిని సంపాదించారు. హైదరాబాద్‌లో బిర్లా మందిర్ రూప శిల్పి ఆయనే. సింహాచలం, కాళేశ్వరం, వేములవాడ లాంటి అనేక ప్రాంతాల్లో పలు ఆలయాలకు కొత్త సొగసులు అద్దారు. శ్రీశైలం, మహానంది ఆలయ గోపురాలను చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో నిర్మింప చేశారు. విదేశాల్లో సైతం ఆలయాలను నిర్మించి, తెలుగు శిల్పుల కీర్తిని దశదిశలా విస్తరింప చేయటలో భాగంగా, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం అమెరికా తిరుపతిగా ప్రసిద్ధి చెంది, రోజూ వేల మంది భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం, 1990లో అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ ద్వారా గౌరవించింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా, శిల్పకళానిధి, కళైమామణి, శిల్పకళా రత్న వంటి బిరుదులెన్నో వరించాయి. వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన గణపతి స్థపతి కంచి కామకోటి పీఠ పరంపరలోని 68వ పీఠాపతులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామికి పరమ భక్తులు. శంకరాచార్య ఆకాంక్ష మేరకు, కంచి సమీపంలో నున్న ఒరుక్కై గ్రామంలో తన అద్భుత శిల్పకల్పనా చాతుర్యంతో మలచిన 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటప నిర్మాణం, తన చిరకాల వాంఛగా తరచూ పేర్కొనేవారు గణపతి స్థపతి. శంకరాచార్య ప్రమాచార్య శుభాశీస్సులతో అక్కడే శంకర శిల్పశాలను స్థాపించి, వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ గణపతి స్థపతి, ఏప్రిల్ 7న, ఈ పార్థివ దేహాన్ని వదిలి వెళ్లారు. ఆ మహాశిల్పి ఈ నేలను వదిలినా, ఆయన సృష్టించిన అపురూప, అపూర్వ శిల్పాలు, నిర్మించిన ఆలయాలు, ఆయన శిల్పకళా ప్రతిబింబాలై కళ్లముందు సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

## ఎస్సై లక్ష్మీనారాయణపై సస్పెన్షన్ వేటు




**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని బాలానగర్ పోలీస్ స్టేషన్ ఎస్సై లక్ష్మీనారాయణపై సస్పెన్షన్ వేటు పడింది. అవినీతి ఆరోపణలు రావడంతో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ (సీపీ) ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై లక్ష్మీనారాయణపై గత కొంతకాలంగా పలు అవినీతి ఆరోపణలున్నాయి. తాజాగా, ఓ మహిళకు సంబంధించిన కేసు విషయంలో ఆయన ముగ్గురు వ్యక్తులను అకారణంగా కొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై బాధితులు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన సీపీ, ప్రాథమిక విచారణ అనంతరం ఎస్సై లక్ష్మీనారాయణను తక్షణమే సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని సీపీ కార్యాలయం తెలిపింది. పోలీస్ శాఖలో అవినీతిని సహించేది లేదని, చట్టాన్ని అతిక్రమించే ఏ అధికారిపై అయినా కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## సామాజిక శాస్త్ర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుంది

**ప్రభుత్వ పాలన విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్.పింగళి నరసింహారావు**





**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రభుత్వపాలన, మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల రీసెర్చ్ మెథడాలజీ కార్యక్రమం విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదో రోజు జరిగింది. ఈ కార్యక్రమంలో హాజరైన ప్రభుత్వ పాలన విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ పింగళి నరసింహారావు మెథడ్స్ ఆఫ్ డాట కలెక్షన్ అనే అంశంపై మాట్లాడుతూ పరిశోధకులు అబ్జర్వేషన్, ఇంటర్వ్యూ, క్వశ్చనేర్ అనే వివిధ రకాల పద్ధతులు ద్వారా సమాచారాన్ని క్షేత్రస్థాయి నుండి సంగ్రహించవలసి వస్తుందని తెలియజేస్తూ ప్రస్తుత తరుణంలో సామాజిక శాస్త్ర పరిశోధనలో ఇంటర్నెట్, సాంకేతిక పరిజ్ఞానం, విషయపరిజ్ఞానాన్ని ఒక క్రమ పద్ధతిలో క్రోడీకరించడానికి దోహదం చేస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డా. ఆకుతోట శ్రీనివాసులు, డా. చీకటి శ్రీను,డా.బుర్రి ఉమాశంకర్, డా. ఓడ్డేపల్లి మోహన్, డా.బండి శ్రీనివాస్ పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డిని కలిసిన పోస్ట్ డాక్టర్లు అసోసియేషన్ సభ్యులు



**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డిని పోస్ట్ డాక్టర్లు అసోసియేషన్ సభ్యులు కలవడం జరిగింది. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల భర్తీ నిమిత్తం ఇటీవల జీఓ నెంబర్ 21ని విడుదల చేయడం జరిగింది. ఇట్టి జీవోలో పోస్ట్ డాక్టర్ ఫెలోషిప్ వారికి 10 మార్కులు కేటాయించి యూజీసీ నిబంధనలు పరిగణలోనికి తీసుకోవాలని విన్నవించడం జరిగింది. దీనికి వారు సానుకూలంగా స్పందించి జీఓ నంబర్లో 21 లో మార్పులు చేర్పులు చేసేటప్పుడు దీనిని పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోస్ట్ డాక్టర్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొమురయ్య ఉపాధ్యక్షులు నరసింహ, మంద వీరస్వామి కన్వీనర్లు ఎం. విజయలక్ష్మి సురాసిక్రిష్ణ. పాల్గొన్నారు.

## ఎంజెపీ డిగ్రీ కళాశాల దరఖాస్తులకు ఆహ్వానం

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల మహబూబాబాద్ 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. మహబూబాబాద్ డిగ్రీ కళాశాల ప్రస్తుతము కాజీపేట మండలంలోని సోమిడిలో కొనసాగుతుంది. ఈ కళాశాలలో అడ్మిషన్ పొందడానికి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఏప్రిల్ 23 నుండి మే 5 వ తేదీ వరకు ఆన్లైన్లో అప్లై చేసుకోగలరు. ఎం జె పి డిగ్రీ కళాశాల సోమిడిలో విద్యార్థుల కోసం హెల్ప్ డెస్క్ ప్రారంభించామని, కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్. సునీత మేడం గారు పేర్కొన్నారు. వివరాల కోసం 9491685294 ఫోన్ నంబర్ ను సంప్రదించగలరు.https://mjpt-bcwreis.telangana.got.In.tgrdccet.cgg.gov.in/TGRD-CWEB<

# ఐకేపిలో జోరుగా సాగుతున్న అక్రమ దందా

**అధికారుల అండదండలతో రైతులను మోసం చేస్తున్న దళారులు, బస్తాకు రెండు కిలోలు కాంటా కొడుతున్నారని రైతుల ఆవేదన..**
**ఎమ్మెల్యే మాటలు సైతం బేకతారు..**
**రైతుల ఆగ్రహం వ్యక్తం**
**వేయింగ్ మిషన్ టాంపరింగ్ చేసి రెండు కిలోలు మోసం చేస్తున్నారని చెప్తున్న రైతులు**

**హన్మకొండ జిల్లా (హసన్ పర్తి) జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని చెప్పుకుంటున్న తరుణంలో రైతులను మోసం చేస్తూ, రైతుల కష్టాన్ని సొమ్ము చేసునుకుంటున్నారు. జిల్లాలో ఐకెపిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐకెపిలో గత కొన్ని సంవత్సరాలుగా రైతులను మోసం చేస్తున్నారని గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం 41 కేజీలు కాంట వేయవలసిందిగా చెప్పినా కూడా వినకుండా ఐకెపిలలోని నిర్వాహకులు 42 కిలోల 500 కాంటవేస్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా న్యాయం చేయట్లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకులతో రైస్ మిల్లర్లు కుమ్మక్కై తాలు పేరుతో దోపిడీ చేస్తున్నారని ఐకెపి సెంటర్లో కాంటవేసిన వడ్లు రైస్ మిల్లులోకి వెళ్లేసరికి తక్కువగా చూపిస్తున్నారని రైతులతో ఐకేపి నిర్వహకులు చెప్పడం పై పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఈ దోపిడి సరిపోదు అనే విధంగా ఐకెపి నిర్వాహకులు ఏపిఎం మరో అఘాత్యానికి దారి తీశారు. ఎపిఎం సూచనతో కొందరు ఏపీఎంల సూచనతో ఐకెపి నిర్వాహకులు ప్రభుత్వం వేసిన కాంటలలో సైతం పగలగొట్టి పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడినట్లు రైతులు గుర్తించడంతో ఈ బండారం శుక్రవారం వెలుగు చూసింది. దీంతో రైతులంతా ఐకెపి సెంటర్ నిర్వాహకులను నిలదీయడంతో వారిని రక్షించడానికి హుటాహుటిన ఐకెపి సెంటర్ కు వచ్చిన ఏపీఎం, సీసీలు రైతులను బుజ్జగించే ప్రయత్నాలు గంటల తరబడి సాగించారు. అయినప్పటికీ రైతులు ససమేరా ఒప్పుకోకపోవడంతో ఏపీఎం తెలివిగా రైతుల పక్షాన నిలిచినట్లుగా ప్రవర్తించి ఐకెపి నిర్వాహకుల నుంచి జరిగిన మోసంలో సగం చెల్లించేటట్లుగా పంచాయతీ నిర్వహించినట్లు రైతులు పేర్కొన్నారు. దీంతో శాంతించిన రైతులు గత నాలుగు సంవత్సరాల నుంచి జరిగిన దోపిడిని లెక్కలతో సహా వెలికి తీసి ఐకెపి మహిళలను ప్రోత్సహించిన ఏపిఎం, సిసి, ఏఈఓల పై ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యక్షంగా పట్టుబడిన ఈ ఒక్క సెంటరే కాకుండా మండలంలోని ప్రతి సెంటర్లో ఏపిఎం లీలలను అధికారులు పసిగట్టాలని రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోతే రైతులంతా ధర్నాలకు దిగి ఒక వడ్ల గింజలు కూడా బయటికి పంపించమని తెలిపారు.



# పాలకుల విధానాలే యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు శాపం

**ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

వివిధ ప్రభుత్వాల పాలక విధానాలే నేడి యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు శాపంగా మారాయని, అనేక సంవత్సరాలుగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వివిధ ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు సరైనవేకరితో సమస్యను పరిష్కరించక యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేశాయని అన్నారు. నేడు కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చేస్తున్న సమ్మె ఏడవ రోజుకి చేరింది. ఈ సమ్మెకు విచ్చేసిన ప్రొఫెసర్ తుమ్మల పాపి రెడ్డి తన సంఘీభావంతో తెలియజేస్తూ సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలోదిన యూనివర్సిటీలో రోజురోజుకు సంక్షోభంలో పడిపోతున్నాయని, వివిధ ప్రభుత్వాలు సరైన దృక్పథంతో ఆలోచించకపోవడం మూలంగా అనేక సమస్యలు యూనివర్సిటీలలో తిష్ట వేశాయని, అందులో భాగంగానే కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ సమస్య సింహ భాగంగా ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ఆలోచిస్తుందని ఇన్నాళ్లు కాంట్రాక్ట్ అధ్యాపకులు వేచి చూశారని, గత పాలకుల నిర్లక్ష్య వైఖరిని కూడా అనుభవించిన మూలంగా నేడు రాష్ట్రంలో 12 యూనివర్సిటీలలో సమ్మెలు జరుగుతున్నాయని ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారాన్ని వెతకాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అన్నారు. అదేవిధంగా ఈ సమ్మెకు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ గారూ తన మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా. పీ కరుణాకర్ రావు, డా. సంకినేని వెంకన్న, డా. ఒ. రవీందర్, డా. శ్రీధర్ కుమార్ లొద్, డా. సాదు రాజేష్, డా. జూల సత్య, డా. ఆరూరి సూర్యం, డా. సూర్యనారాయణ, డా. చంద్రశేఖర్, డా. నాగయ్య, డా. రఘు వర్ధన్ రెడ్డి, డా. ఫిరోజ్, డా. కొమురయ్య, డా. ప్రణీత, డా. శ్రీదేవి, డా. శ్రీలత,డా. కవిత, డా. సరిత, డా సుజాత,డా. స్వప్న, డా. కల్పన,డా. వాణిశ్రీ, శ్రీజ, దీప్తి,డా. పరినఫాతిమా, సలోని, డా. రేఖ, డా. వందన, డా. రమాదేవి , డా. బ్లేస్సి ప్రియాంక,డా. ప్రసాద్, డా. సంగీత్, దయాకర్, డా. గడ్డం కృష్ణ, డా. సుచరిత పాల్, తూర్పటి వెంకటేష్, కిషన్, డా. సతీష్ కుమార్,డా. రమేష్, డా. రాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యతోపాటు జాతీయ ప్రవజాలం ముందుకు పోవాలి





**ఏబీవీపీ ప్రాంత ప్రముఖ్ మాసాడి బాపురావు**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మరియు సామా జగన్ మోహన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఈఏపిసిఈటి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం హనుమకొండలోని బాలసముద్రం సామా జగన్మోహన్ స్మారక భవన్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ప్రాంత ప్రముఖ్ మాసాడి బాపురావు, హనుమకొండ సీఐ సతీష్, డాక్టర్ భగీరథ, వరంగల్ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ ఏలేటి నాగరాజు రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి అనంతరం మాట్లాడుతూ ఏబీవీపీ ఆందోళన కార్యక్రమాలే కాకుండా నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యారంగంలోని ప్రతి సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపుతూ విద్యార్థి పరిషత్ విద్యార్థుల శ్రేయస్సు కోసం పని చేస్తూ నిరంతరం దేశ సమున్నది కోసం విద్యార్థుల శ్రేయస్సు కోసం ముందుండే ఏకైక ఆర్గనైజేషన్ ఏబీవీపీ అని అలాగే జాతీయ భావాలు కలిగిన విద్యార్థి పరిషత్ కార్యకర్త సామ జగన్ మోహన్ స్వతంత్ర అనంతరం నరహంతక నక్సలైట్లు విద్రోహ శక్తులు జాతీయ జెండాకు అవమానం చేస్తే అలాంటి సంఘ విద్రోహులను ఎదిరించి తన ప్రాణాలను విడిచిన సామ మోహన్ రెడ్డి అని అలాంటి దేశభక్తి కలిగిన విద్యార్థులుగా దేశ అభివృద్ధి కోసం అందరూ దేశం పట్ల భక్తి కలిగి ఉండాలని, విద్యార్థి పరిషత్ విద్యార్థులకు జాతీయ భావాలను నింపుతూ కేవలం ఏబీవీపీ ఆందోళన కార్యక్రమాలే కాకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రపంచంలోనే దేశభక్తి విద్యారంగ శ్రేయస్సు కలిగిన అతిపెద్ద విద్యార్థి సంస్థ విద్యార్థి పరిషత్ గా మన ముందు ఉంది. మనమందరం కూడా ఈ దేశం కోసం పనిచేసినటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ అలాంటి విలువలతో సమాజం కోసం మనందరం కూడా మన వంతు సహాయం చేస్తూ పనిచేయాలని ఏబీవీపీ, సామా జగన్ మోహన్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఉచిత ఈఏపిసిఈటి శిక్షణ తరగతుల విద్యార్థులు అందరూ కూడా భవిష్యత్తులో అత్యుత్తమ కళాశాలలో చేరి మీ భవిష్యత్తులో ఎదగాలని కోరుకుంటున్నాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంట హర్షవర్ధన్, ప్రాంత కార్య సమితి సభ్యులు ఆరెపల్లి సుజిత్, కొత్తపల్లి సుధాకర్, ఉపాధ్యాయులు, శ్రీదేవి, రోహిణి, సంజీవ్, ప్రశాంత్, చంద్రశేఖర్, రాజేంద్ర చారి, ప్రసాద్, శ్రీనివాస్, జోనల్ ఇన్చార్జిలు హరిచరణ్, శ్రీకాంత్, ప్రవిజ్ఞాన్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోడ పత్రికను ఆవిష్కరించిన వైస్ ఛాన్సలర్ ఆచార్య కే ప్రతాప్ రెడ్డి

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఎం.కాం - 2025 సంవత్సరానికి గాను స్టేట్ లెవెల్ ఫ్రీ ఆన్ లైన్ పి.జి.ఎంట్రన్స్ కోచింగ్" కు సంబందించిన గోడ పత్రికను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, తన కార్యాలయం లో ఆవిష్కరించారు అని కాకతీయ గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజా రెడ్డి తెలిపారు, ఈ ఆన్లైన్ ఫ్రీ ఎంట్రన్స్ కోచింగ్ ను కరీంనగర్ ఎస్. ఆర్. ఆర్. ప్రభుత్వ కళాశాల తో సంయుక్తంగా మే నెల 26 వ తేది నుంచి నిర్వహిస్తునట్టు, మరిన్ని వివరాలు 9989292372 లో సంప్రదించవచ్చు అని అయన తెలిపారు, ఈ కార్యక్రమం లో డాక్టర్ డి. రాజశేఖర్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ జి. శ్రీనివాస్, డాక్టర్ మహమ్మద్ యాకుబ్, డాక్టర్ జ. చిన్నా, డాక్టర్ జి.కే. కుమార్, డాక్టర్ ఎం. రవి కుమార్ పాల్గొన్నారు.



# ఉద్యోగ జీవితం సంతృప్తిని ఇచ్చింది

**కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్సు ఆఫీసర్ తోట రాజయ్య**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఉద్యోగ జీవితం సంతృప్తిని ఇచ్చింది అని కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్సు ఆఫీసర్ తోట రాజయ్య అన్నారు. ఈ నెల చివర తన ఉద్యోగ విరమణ నైపధ్యం, విశ్వవిద్యాలయ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు డాక్టర్ ఎస్. సుజాత అధ్యక్షతన, విశ్వవిద్యాలయ అతిది గృహంలో ఏప్రిల్ 25 మధ్యహ్నం నిర్వహించిన ముందుస్తు ఉద్యోగ విరమణ సన్మాన సభలో, సన్మానాని స్వీకరించి మాట్లాడారు, సుమారు 4 దశాబ్దాల ఉద్యోగ జీవితంలో వివిధ హోదాలలో, వివిధ కార్యాలయాల లో, కాలేజీలలో పని చేసిన అనుభవాన్ని పంచుకున్నారు, విశ్వవిద్యాలయానికి ఋణ పడి ఉంటాను అన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున



కృత్షతలు తెలియచేసారు, శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్చాలతో గెజిటెడ్ అధికారుల సంఘం తోట రాజయ్య దంపతులను సన్మానించారు, సెక్రటరీ హబీబుద్దీన్ వందన సమర్పణ గావించారు.

## వర్ధన్నపేట ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**కాంగ్రెస్ సేవా దళ్ జిల్లా అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్**

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**



బిఆర్ఎస్ నాయకుడు రాజేష్ నాయక్ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పై సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారంగా అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా పాలనాపరమైన విషయాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని అవహేళనగా మాట్లాడిన రాజేష్ నాయక్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సేవా దళ్ జిల్లా అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కార్యాలయం లో మాట్లాడారు....ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ఇలాంటి వ్యక్తులు సోషల్ మీడియాలో రూమర్లు సృష్టిస్తూ ప్రభుత్వం పై కాంగ్రెస్ ఎమ్మెల్యే లు మహిళ మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఇలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ వారు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**హైద్రాబాద్ జై బీమ్ న్యూస్**

మహబూబాబాద్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గౌస్ పాషా ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు దాడులు చేశారు. కురవి రోడ్డులో ఉన్న ఆయన నివాసంతోపాటు మహబూబాబాద్, జమ్మికుంట, హైదరాబాద్‌లోని ఆయన బంధువుల ఇండ్లలోనూ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అవినీతి ఆరోపణల దృష్ట్యా ఇప్పటికే ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు. గతంలో మహబూబాబాద్‌లో డీటీఓగా పనిచేస్తున్న సమయంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

## ధాన్యం కొనుగోలులో తీవ్ర నిర్లక్ష్యం

**మద్దతు ధరలు రాక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు**

**వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీష్ రావు**



**సిద్దిపేట,ఏప్రిల్ 25(ఆరెన్ఎ):**

వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు-చేయకపోవడం వల్ల రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. క్వింటాకి 2,320 రూపాయలు మద్దతు ధర రావాల్సి ఉండగా దళారులకు 2 వేలు, 2,100 రూపాయలకే అమ్ముకుంటున్నారని చెప్పారు. ఇది రైతు కంటక ప్రభుత్వం అని హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి చేయలేదని.. రైతు బంధుని వానకాలంలో ఎగ్గొట్టి యాసంగిలో రెండు మూడు ఎకరాలకే ఇచ్చారని తెలిపారు.అకాల వర్షాలు, వడగండ్ల వానల భయంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే దుస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. గతేడాది వానాకాలంలో మొత్తం 1 లక్షా 53 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి, కేవలం 52 వేల మెట్రిక్ టన్నులే సేకరించగలిగిందని అన్నారు. మిగతా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బయటకు వదిలేసిందని.. అంటే మూడొంతుల్లో ఒక వంతు మాత్రమే కొనుగోలు చేయగలిగిందని అన్నారు. రెండొంతుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారని చెప్పారు. యాసంగి పంటకు కూడా ప్రభుత్వంలో అదే నిర్లక్షయం కనబడుతోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, గాలి దుమారం వల్ల మూడు నాలుగు లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. అందుకు ఎకరాకి 20 వేల రూపాయలను ఇన్‌పుట్ సబ్సిడీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదిక తెప్పించుకొని రైతులను ఆదుకోవాలన్నారు. నంగునూరు మండలం పాలమాకుల వడ్ల కొనుగోలు కేంద్రంలో వడ్లు కొని వారం అయినా ఇంకా రైతులకి డబ్బులు ఇవ్వలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏమో 48 గంటల్లో రైతులకు డబ్బులను అకౌంట్‌లో వేస్తున్నామని హైదరాబాద్‌తో చెబుతారని అన్నారు. గన్నీ బ్యాగులు నాణ్యంగా లేకపోవడం వల్ల హమాలీలకు ఇబ్బందిగా ఉందని.. తూకంలో క్వింటాకి రెండు కిలోలు తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. అటు- అకాల వర్షాలు, ఇటు- రైతు బంధు, మద్దతు ధర రాక ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని వెంటనే ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వరుసగా రెండోరోజూ అదేపరిస్థితి

**నష్టాల్లో ముగసిన స్టాక్ మార్కెట్లు**

**ముంబై,ఏప్రిల్25(జై భీమ్ న్యూస్) :**

భారత స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతం శుక్రవారం)రెడ్ లో ముగిశాయి. మార్కెట్లు- నష్టాలతో ముగియడం వరుసగా ఇది రెండోరోజు. నిఫ్టీ 207.35 పాయింట్లు నష్టపోగా, సెన్సెక్స్ 588.90 పాయింట్లు పతనమైంది. అయితే, ఇవాళ ఐటీ స్టాక్స్ మెరుగ్గా రాణించడం విశేషం. ఐటీ- మినహా, మిగతా అన్ని రంగాలలో.. మీడియా, మెటల్, పీఎస్ యూ, -టెలికాం, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, రియాల్టీ 2 నుంచి 3 శాతం క్షీణించాయి. బిఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 2.5 శాతం నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, టెంట్ నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. లాభపడిన వాటిలో ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇన్ఫోసిస్, టీ-సీఎస్, -టె-క్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఉన్నాయి. కొత్త డెరవేటివ్ సిరీస్ మొదలైన మొదటి రోజు మార్కెట్లు- బలహీనంగా ముగిశాయి. ప్రధానంగా భారత్ - పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మార్కెట్లో నష్టాలు కనిపించాయి. ఇవాళ ఉదయం మార్కెట్లు- మంచి గ్యాప్ అప్ తో ప్రారంభమైనప్పటికీ తర్వాత భారీ నష్టాలలోకి జారుకున్నాయి. నిఫ్టీ, సెన్సెక్స్ సెషన్ మొదటి అర్ధభాగంలో పదునైన క్షీణతను చూసింది. అయితే, కొన్ని హెవీవెయిట్ స్టాక్‌లు పుంజుకోవడంతో రెండవ సెషన్ కొంతమేర నష్టాలు తగ్గడానికి సహాయపడింది. చివరికి, నిఫ్టీ ఇండెక్స్ 0.86శాతం తగ్గి 24,039.35 వద్ద స్థిరపడింది. ఇవాళ అన్ని రంగాలు చాలా వరకు రెడ్‌లో ట్రేడ్ అయ్యాయి. రియాల్టీ, ఫార్మా, ఎనర్జీ టాప్ లూజర్‌లుగా నిలువగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ మరియు స్మాల్ క్యాప్ సూచీలు రెండూ ఒక్కొక్కటి రెండు శాతం మించి నష్టాలతో ముగియడంతో బ్రాడర్ మార్కెట్లలో ఒత్తిడి మరింత స్పష్టంగా కనిపించింది. పెరిగిన భౌగోళిక రాజకీయ అనిశ్చితి పెట్టు-బడిదారులను రిస్క్-ఆఫ్ విధానాన్ని అవలంబించడానికి ఉసికొల్పింది. మరోవైపు మొన్నటి వరకూ సాగిన బుల్ ర్యాలీ తర్వాత మదుపర్లు లాభాల బుకింగ్‌కు చూడ్డంతో ఈ పరిస్థితి ఎదురైంది.

## పాక్ హ్యాకర్ల పన్నాగం ఆర్మీ కాలేజీ వెబ్‌సైట్ హ్యాక్

**న్యూఢిల్లీ,ఏప్రిల్25(జై భీమ్ న్యూస్) :**


పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇండియా, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే ప్రయత్నంలో భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. సింధు జలాల సరఫరాను కూడా నిలిపివేసింది. భారత్ తీసుకునే నిర్ణయాలతో పాకిస్తాన్ అతలాకుతలం అవుతోంది. అయితే ఇంత జరుగుతున్నా పాకిస్తాన్‌కు మాత్రం బుద్ధిరావటం లేదు. పాడు పనులు చేస్తూనే ఉంది. పాకిస్తాన్‌కు చెందిన కొందరు హ్యాకర్లు .. ఆర్మీకి చెందిన కాలేజీ వెబ్ సైట్‌ను హ్యాక్ చేశారు. ఆర్మీ వర్గాల సమాచారం ప్రకారం.. ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ-కి చెందిన ఆర్మీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వెబ్ సైట్‌ను పాకిస్తాన్‌కు చెందినట్లు-గా భావిస్తున్న కొందరు హ్యాకర్లు హ్యాక్ చేశారు. అంతేకాదు.. ' యూ ఆర్ హ్యాక్డ్ ' అంటూ వెబ్ సైట్ హోం పేజీలో ఓ మెసేజ్‌ను కూడా వదిలారు. అందులో 'టీ-మ్ ఇంసేన్ పాక్' అని ఉంది. ఈ నేపథ్యంలో ఆర్మీ వర్గాలు అప్రమత్తం అయ్యాయి. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీ-ం సాయం తీసుకుంటామని స్పష్టం చేశాయి. గతంలోనూ టీ-మ్ ఇంసేన్ పాక్ గ్రూపు సైబర్ దాడులకు పాల్పడినట్లు- తెలుస్తోంది. భారత ప్రభుత్వ, ఇతర వెబ్ సైట్లను హ్యాక్ చేయడానికి ఈ గ్రూపు ప్రయత్నించింది. 2023 జీ20 సమ్మిట్ సమయంలోనూ ప్రభుత్వ వెబ్ సైట్‌ను టార్గెట్ చేసినట్లు- తెలుస్తోంది. తరచుగా సైబర్ దాడులకు పాల్పడుతూ విఫలం అవుతూ వస్తోంది.

## బిఆర్ఎస్ రజతోత్సవ మహా సభ వేళ ట్రాఫిక్ మళ్ళింపు

**ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ**

**ప్రయాణికులకు మరియు వాహనదారులకు పోలీస్ వారి విజ్ఞప్తి**

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**



ప్రయాణికులకు వాహనదారులకు ఈ నెల తేది 27 రోజున ఎల్కతుర్తి గ్రామం, మండలములో భారత రాష్ట్ర సమితి పార్టి యొక్క రజతోత్సవ మహా సభ ఉన్నది. మధ్యాహ్నం 12.00 గంటల నుండి మొదలయి రాత్రి 12.00 గంటల వరకు జరుగుతుంది. ఇట్టి సమయములో ట్రాఫిక్ ఆంక్షలు విధించనైనది. ఇట్టి సమయములో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా దారి మల్లించనైనది. ప్రయాణికులు మరియు వాహనదారులు ఈ క్రింద సూచించిన దారులలో ప్రయాణించి సహకరించగలరు. కావున మళ్ళించినా దారిలో ప్రయాణికులు, వాహనదారులు వెళ్లి పోలీస్ వారికి సహకరించగలరని పోలీస్ వారి విజ్ఞప్తి. దారి మళ్ళింపులు కరీంనగర్ నుండి హన్మకొండ, వరంగల్ వయా పర్కాల్ క్రాస్ రోడ్ (హుజురాబాద్), ఉప్పల్, కమలాపూర్, అంబాల, ముచ్చర్ల క్రాస్ రోడ్ నూతనంగా వేసిన రోడ్ నుండి ఓఆర్ఆర్ వరంగల్, హన్మకొండ నుండి కరీంనగర్. వయా హన్మకొండ, ముచ్చర్ల క్రాస్ రోడ్ నూతనంగా వేసిన రోడ్ నుండి ఓఆర్ఆర్, అంబాల, కమలాపూర్, ఉప్పల్, పర్కాల్ క్రాస్ రోడ్ (హుజురాబాద్), కరీంనగర్. సిద్దిపేట నుండి హన్మకొండ వయా సిద్దిపేట, జనగాం, హన్మకొండ. హన్మకొండ నుండి సిద్దిపేట వయా హన్మకొండ, జనగాం, సిద్దిపేట. హుస్నాబాద్ నుండి హన్మకొండ వయా హుస్నాబాద్, తరిగొప్పుల, హన్మకొండ హన్మకొండ నుండి హుస్నాబాద్ వయా హన్మకొండ, జనగాం, సిద్దిపేట. హుస్నాబాద్ నుండి హన్మకొండ వయా ముల్కనూర్, కొత్తకొండ,వేలేరు, మల్లికుదుర్ల, క్యాతంపల్లి,పెద్దపెండ్యాల, హన్మకొండ. హన్మకొండ నుండి హుస్నాబాద్ వయా హన్మకొండ, పెద్దపెండ్యాల, క్యాతంపల్లి, మల్లికుదుర్ల, వేలేరు, కొత్తకొండ, ముల్కనూర్. మీదుగా వాహనాలను మళ్లించడం జరుగుతుందని ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ వెల్లడించారు.

## దివంగత స్వర్గీయ నాగమల్ల సురేష్ 58వ జయంతి వేడుక

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

హసన్‌పర్తి నగర కేంద్రంలో స్వర్గీయ నాగమల్ల సురేష్ జయంతి వేడుకని ఎన్ఎస్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మేకల యుగేందర్ సభాధ్యక్షతన ముఖ్యఅతిధిగా భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర కార్పోరేటర్ గురుమూర్తి శివకుమార్ పాల్గొని సురేష్గారి చిత్రపతానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు నాగమళ్ళ సురేష్ తెలంగాణ ఉద్యమ పోరాటంలో రాజకీయలకతీకంగా అందరిని కలుపుకొని హసన్‌పర్తి గడ్డప్కె విరోచితమ్కైన ఉద్యమం చేసిన గొప్పవ్యక్తి సురేషన్నని అన్నారు. నాగమల్ల సురేష్ వారసులు సంతోష్ మాట్లాడుతు ఊరికోసం తన జీవితాన్ని స్కెతం లెక్కచేయకుండా పరితపించి కుటుంబం కంటే ఎక్కువగా ప్రజలే జీవితమని భావించే వారు మానాన్న సురేష్ ని వారి వారసునిగా ప్రజాశ్రేయస్సుక్కె, సమాజ సేవలో ముందుటానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పిట్టల కుమారస్వామి,బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్,ఆత్మ జిల్లా చ్కెర్మన్ కందుకూరి చంద్రమోహన్,సామాజిక ఉద్యమకారులు శీలం యాదగిరి,భాజపా నాయకులు పెద్దమ్మ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరెపల్లి పవన్ కాంగ్రెస్ నాయకులు బల్సుకూరి శ్రీనివాస్ ఎన్ఎస్ ఫౌండేషన్ సభ్యులు గొడిశాల రవిప్రసాద్,శీలం గణేష్,మేకల తిరుపతి తదితర మిత్రబృందాలు పాల్గొన్నారు.




## నమామాత్రపు ధరలకు చెరువులో మట్టి

**రైతులు ఉపయోగించుకోవాలన్న మంత్రి**

**విజయవాడ,ఏప్రిల్25(జై భీమ్ న్యూస్):**

రైతుల అవసరాల కోసం చెరువుల్లో పూడిక తీసిన మట్టిని, క్యూబిక్ మీటర్ ఒక్క రూపాయికే, రైతులకు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం ఇచ్చారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. చెరువుల్లో పూడిక తీయడంతో పాటు రైతుల పంట పొలాలకు సారవంతమైన మట్టి లభిస్తుంది అన్నారు. విజయవాడలోని జలవనరుల క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్ కు ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, ఈఎన్సీ ఎం. వెంకటేశ్వరరావు, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. గత 6 ఏళ్ళ నుంచి సీఈ స్థాయి నుంచి కింది స్థాయి ఏఈఈ ఉద్యోగుల వరకు ప్రమోషన్స్ కు నోచుకోని, 466 మందికి పదోన్నతులను జలవనరుల శాఖ కల్పించిందని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. అయితే, గత ప్రభుత్వం లష్కర్లకు ఎగ్గొట్టిన ఏడాది జీతం బకాయిల కోసం సుమారు 9 కోట్ల 57 లక్షల రూపాయలను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అలాగే, ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుల్లో పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.


# మరోసారి పెరిగిన బంగారం ధరలు



దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకుని లక్ష రూపాయలు దాటాయి. ఆ తర్వాత బుధవారం బంగారం ధరలో పెద్ద తగ్గుదల కనిపించింది. ఇప్పుడు ధరలో తగ్గుదల ఉంటుందని అనిపించింది. కానీ అలాంటిలేమి జరగలేదు. గురువారం బంగారం ధరలో పెరుగుదల కనిపించింది. దీనికి ప్రధాన కారణం డాలర్ ఇండెక్స్ పతనమని భావిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డాలర్ ఇండెక్స్ పతనం ప్రభావం రాబోయే రోజుల్లో కనిపిస్తుంది. అలాగే బంగారం ధర కొత్త రికార్డు స్థాయికి చేరుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర ఎంత పెరిగిందో, ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు 200 రూపాయలు పెరిగి 10 గ్రాములకు 99,400 రూపాయలకు చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర బుధవారం చారిత్రాత్మకమైన రూ.1 లక్ష స్థాయి నుండి యు-టర్న్ తీసుకుని 10 గ్రాములకు రూ.2,400 తగ్గి రూ.99,200కి చేరుకుంది. అదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.200 పెరిగి రూ.98,900కి చేరుకుంది. మునుపటి ముగింపు ధర 10 గ్రాములకు రూ.98,700గా ఉంది. ఇదిలా ఉండగా, గురువారం వెండి ధరలు కిలోకు రూ.700 పెరిగి రూ.99,900కి చేరుకున్నాయి. మునుపటి ముగింపు ధరలో వెండి కిలోకు రూ.99,200 వద్ద ముగిసింది. బంగారం ధర ఎందుకు పెరిగింది?: అమెరికా, చైనా మధ్య ప్రస్తుతం నెలకొన్న వాణిజ్య ప్రతిష్టంభన కొంతకాలం కొనసాగవచ్చని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ బుధవారం అన్నారు. ఇది కాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాబోయే రెండు, మూడు వారాల్లో చైనాకు కొత్త సుంకాల రేట్లు అందుకోవచ్చని సూచించారు. సాంకేతిక దిద్దుబాటు కారణంగా బంగారం ధర ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల నుండి పడిపోయిన తర్వాత ట్రంప్, బెసెంట్ వ్యాఖ్యలు సురక్షితమైన ఆస్తిగా బులియన్ డిమాండ్‌ను పునరుద్ధరించడానికి సహాయపడ్డాయని కమోడిటీ మార్కెట్ నిపుణులు అంటున్నారు. స్వల్పకాలిక తగ్గుదల తర్వాత బంగారం ధరలు పెరిగాయని, లాభాల బుకింగ్ కారణంగా బంగారం రికార్డు స్థాయికి చేరుకుందని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సిఇఒ చింతన్ మెహతా అన్నారు. ట్రంప్ తాజా ప్రకటన అమెరికా ఆర్థిక పరిస్థితి గురించి అనిశ్చితిని సృష్టించింది. ఇది సురక్షితమైన పెట్టుబడిగా బంగారానికి డిమాండ్‌ను పెంచింది.

# టెక్ మహీంద్రా లాభం జూమ్

మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 76.5 శాతం వృద్ధి చెంది రూ.1,166.7 కోట్లకు పెరిగింది. ఆదాయం 4 శాతం పెరిగి రూ.13,384 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)తో పోలిస్తే మాత్రం కంపెనీ లాభంలో 19 శాతం, ఆదాయంలో కేవలం 1 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి టెక్ మహీంద్రా నికర లాభం 80 శాతం వృద్ధితో రూ.4,252 కోట్లకు, ఆదాయం 2 శాతం పెరుగుదలతో రూ.52,988 కోట్లకు చేరుకుంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండ టంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.30 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది. క్యూ4లో కంపెనీ 79.8 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,800 కోట్లు) విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. ఏడాది క్రితం ఇదే కాలానికి లభించిన ఆర్డర్లతో పోలిస్తే 60 శాతం అధికమిది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లభించిన కొత్త డీల్స్ విలువ 270 కోట్ల డాలర్లు (దాదాపు రూ.23,000 కోట్లు)గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 42 శాతం ఎక్కువ. క్యూ3తో పోలిస్తే క్యూ4లో సంస్థ ఉద్యోగుల సంఖ్య 1,757 మేర తగ్గింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 3,276 మంది తగ్గారు. దాంతో, ఈ మార్చి 31 నాటికి టెక్ మహీంద్రాలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 1,48,731కి జారుకుంది. కాగా, మార్చి త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 11.8 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలన్న లక్ష్యాన్ని మించి 6,100 నియామకాలు చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) క్యాంపస్ హైరింగ్ లక్ష్యాన్ని వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించింది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి పెరిగిన నేపథ్యంలో ఐటీ సేవలకు డిమాండ్ మందగించడం ఇందుకు కారణంగా పేర్కొంది.







## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. లక్షల కోట్లు ఆవిరి..


కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో భారత మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి . అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు ఉండటంతో లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ తర్వాత దాదాపు 950 పాయింట్లు నష్టపోయి ప్రస్తుతం 79,000 మార్కు కంటే దిగువన ట్రేడవుతోంది. మరోవైపు నిఫ్టీ 24,000 పాయింట్ల కంటే దిగువకు పడిపోయింది. దేశంలోని మూడవ అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన యాక్సిస్ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో అంతగా ఆకట్టుకోలేకపోయింది. త్రైమాసిక లాభం గతేడాది ఇదే కాలంలో రూ.7,130 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.7,117 కోట్లకు తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. బ్యాంక్ షేర్లు 4.65% పడిపోవడం మదుపర్లను కలవరపెడుతోంది. యాక్సిస్ బ్యాంక్‌తో పాటు, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా ఇవాళ భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ లాభాల్లో ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు ఏ పరిస్థితులకు దారితీస్తాయోనని పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఆసియా మార్కెట్లు సహా ప్రపంచ మార్కెట్లు సానుకూల సంకేతాలు అందిస్తున్నాయి. దక్షిణ కొరియా కోస్పి ఇండెక్స్, టోక్యో నిక్కీ 225, హాంకాంగ్ హాంగ్ సెంగ్, షాంఘై ఋజు కాంపోజిట్ అన్నీ గ్రీన్‌లో ఉన్నాయి. అమెరికా ఈక్విటీలలో కూడా ఇలాంటి ధోరణులు కనిపించాయి. నిన్న సాయంత్రం నాస్‌డాక్ కాంపోజిట్ 2.74 శాతం లాభపడింది. ఎస్‌డ పి 500 2 శాతం పైగా పెరిగింది, డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1.23 శాతం పెరిగింది.

## జర్నలిస్ట్‌పై బిజెపి కార్యకర్తల దాడి

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి విషయంలో వచ్చే పలు అనుమానాలు, ప్రశ్నలను బిజెపి నాయకులు, కార్యకర్తలు సహించలేకపోతున్నారు. ఈ విషయంలో ప్రశ్నలు సంధించిన జర్నలిస్టులపైనా కాషాయ మూకలు దాడికి దిగుతున్నారు. జమ్మూకాశ్మీర్‌లోని కథువా జిల్లాలో బిజెపి చేపట్టిన నిరసనలను కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించడంతో అక్కడి బిజెపి కార్యకర్తలు వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ నిరసనల్లో బిజెపి శాసనసభ్యులు దేవిందర్ మాన్యాల్, రాజీవ్ జస్రోటియా, భరత్ భూషణ్ పాల్గొన్నారు. ముష్కరుల దాడికి దారి తీసిన భద్రతా లోపాల గురించి జర్నలిస్టు రాకేశ్ శర్మతో పాటు ఇతర జర్నలిస్టులు కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ఇలా అడగటాన్ని జీర్ణించుకోలేని బిజెపి ఎమ్మెల్యేలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జర్నలిస్టులు వేర్పాటువాద భాషను మాట్లాడుతున్నారని బిజెపి నేత హిమాన్షు శర్మ ఆరోపించారు. దీనిపై జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆగ్రహానికి గురైన బిజెపి కార్యకర్తలు రాకేశ్ శర్మపై దాడి చేశారు. ప్రస్తుతం ఈ దాడికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ దాడి నుంచి డిఎస్‌పి రవీందర్ సింగ్ తనను కాపాడారనీ, ఆ తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారని బాధితుడు రాకేశ్ శర్మ తెలిపారు.

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు



ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం. అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఆయనకు పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్‌ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు. 1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నపుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుముకోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. (1729 = 1గీ3 o 12గీ3 = 9గీ3 o 10గీ3 ). ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం.. 15ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. చిత్తు కాగితాలను కూడా బహు జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వ విద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877-1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..



# 4 క్యాచ్‌లు వదిలేశావ్..

ప్రస్తుతానికి రాజస్థాన్ రాయల్స్ జట్టు ప్లే ఆఫ్స్ నుంచి దూరంగా సాగుతోంది. ఆ జట్టుకు ఏదీ కలసి రావడం లేదు. మొదటిది, ఆ జట్టు రెగ్యులర్ కెప్టెన్ గాయం కారణంగా ఆడటం లేదు. అదే సమయంలో, జట్టును నడిపించే సారథి క్యాచ్‌లు వదులుకోవడం ద్వారా అవాంఛనీయ రికార్డులు సృష్టించడం లో బిజీగా ఉన్నాడు. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌కు ముందు, ఆ జట్టు 8 మ్యాచ్‌ల్లో 2 మాత్రమే గెలిచింది. పాయింట్ల పట్టికలో రాజస్థాన్ జట్టు 8వ స్థానంలో ఉంది. గాయం కారణంగా రెగ్యులర్ కెప్టెన్ సంజు శాంసన్ ప్లేయింగ్ ఎలెవన్ జట్టుకు దూరంగా ఉన్నాడు. ఇటువంటి పరిస్థితిలో, రియాన్ పరాగ్ జట్టును నడిపిస్తున్నాడు. కానీ, ఈ ఆటగాడు తన ప్రదర్శనతో తన సహచరుల మనోధైర్యాన్ని తగ్గిస్తున్నాడు. ఈ సీజన్‌లో రియాన్ పరాగ్ చాలా సందర్భాల్లో క్యాచ్‌లను వదిలేశాడు. ఇది జట్టుకు చాలా హానికరమని నిరూపితమైంది. ఈ సీజన్‌లో రియాన్ పరాగ్‌ను రాజస్థాన్ రాయల్స్ రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ అతను ఇంకా తనను తాను నిరూపించుకోలేక పోయాడంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఫ్యాన్స్ కూడా రూ. 14 కోట్లు దక్కించుకుని జాల్సాలు చేస్తున్నావ్ భయ్యా అంటూ ట్రోల్స్ చేస్తున్నారు. ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీతో జరిగిన 42వ మ్యాచ్‌లో, రియాన్ పరాగ్ మర్చిపోలేని తప్పు చేశాడు. ఆర్‌సీబీ ఇన్నింగ్స్ సమయంలో రాజస్థాన్ రాయల్స్ ఫాస్ట్ బౌలర్ ఫజల్హక్ ఫరూఖీ రెండవ ఓవర్ వేయడానికి వచ్చాడు. ఈ ఓవర్ రెండో బంతికి ఫరూఖీ ఫుల్ టాస్ వేశాడు. ఆర్‌సీబీ ఓపెనర్ ఫిల్ సాల్ట్ షాట్ ఆడటానికి వెళ్ళాడు. కానీ, బంతి మిడ్-ఆఫ్ వైపు వెళ్లింది. అక్కడే ఉన్న రియాన్ పరాగ్ క్యాచ్ తీసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ, బంతి అతని చేతిలోంచి జారిపోయింది. ఆ సమయంలో సాల్ట్ 1 పరుగుతో ఉన్నాడు. ఆ తరువాత, సాల్ట్ 23 బంతుల్లో 4 ఫోర్ల సహాయంతో 26 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అలాగే, విరాట్ కోహ్లీతో కలిసి 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

# అరుదైన రికార్డులో చేరనున్న చెన్నై సారథి..



ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో అత్యుత్తమ ఆటగాళ్లు ఉన్నారు. ప్రస్తుత చెన్నై కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్‌లో పాల్గొన్న అతి పెద్ద వయస్సు గల ఆటగాడిగా నిలిచాడు. ఎంఎస్ ధోని కెప్టెన్సీలో చెన్నై 5 సార్లు ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకుంది. 2024 సీజన్‌కు ముందు ఎంఎస్ ధోని చెన్నై కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. నేడు చెపాక్‌లో ఐపీఎల్ సీజన్ 18 వ సీజన్‌లో భాగంగా 43వ మ్యాచ్ జరగనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తపలడనుంది. ప్రస్తుత చెన్నై కెప్టెన్ ధోని సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే టీ20లో భారీ చరిత్రను సృష్టించనున్నాడు. ధోని నేడు తన 400వ టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. ధోని టీ20 కెరీర్ గురించి మాట్లాడితే, 399 మ్యాచ్‌ల్లో 350 ఇన్నింగ్స్‌ల్లో 7566 పరుగులు చేశాడు. ఈ పరుగులు 38.02 సగటు, 135.90 స్ట్రైక్ రేట్‌తో సాధించాడు. ఇందులో 28 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. ధోని మొత్తం 98 3అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 126.13 స్ట్రైక్ రేట్‌తో 1617 పరుగులు చేశాడు. ఇందులో 2 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ధోని ఐపీఎల్‌లో 272 మ్యాచ్‌లు ఆడాడు. 137.87 స్ట్రైక్ రేట్‌తో 5377 పరుగులు చేశాడు. ఇక దేశీయ క్రికెట్‌లో జారఖండ్ తరపున మొత్తం 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఛాంపియన్స్ లీగ్‌లో చెన్నై తరపున 449 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో 400 మ్యాచ్‌లు ఆడిన నాలుగో భారత ఆటగాడిగా ధోనీ నిలిచాడు. దీనికి ముందు, రోహిత్ 456 మ్యాచ్‌లు ఆడి 12058 పరుగులు చేశాడు. దీంతో టీ20లో అత్యధికంగా ఆడిన భారత ఆటగాడిగా నిలిచాడు. 412 మ్యాచ్‌ల్లో 7537 పరుగులు చేసిన దినేష్ కార్తీక్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ 412 మ్యాచ్‌లతో మూడో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ 408 మ్యాచ్‌ల్లో 13278 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ చెన్నై, హైదరాబాద్ జట్లకు డూ ఆర్ డై పరిస్థితిలా మారింది. ఐపీఎల్ 2025 సీజన్ రెండు జట్లకు షాక్ లాంటిదే. 8 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో చెన్నై పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. హైదరాబాద్ తొమ్మిదవ స్థానంలో ఉంది. ఇప్పుడు రెండు జట్లు సీజన్‌లోని మిగిలిన భాగంలో తిరిగి పునరాగమనం చేయాలని ఆసక్తిగా ఉన్నాయి.

# ఆర్సీబీని గెలుపు వెనుక అసలు హీరో

ఐపీఎల్ 2025లో సొంత మైదానంలో వరుస ఓటములకు ఆర్సీబీ బ్రేక్ వేసింది. ఈ సీజన్‌లో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో వరుసగా మూడు మ్యాచ్‌లో ఓడిపోయిన ఆర్సీబీ.. గురువారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూపర్ విక్టరీ సాధించింది. చివరి రెండు ఓవర్లలో 18 పరుగుల డిఫెండ్ చేసుకొని ఔరా అనిపించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీకి సూపర్ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ అద్భుతమైన స్టార్ట్ అందించాడు. మొత్తంగా 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులతో 70 పరుగులు చేసి అదరగొట్టాడు. కోహ్లీతో పాటు దేవదత్ పడిక్కల్ 27 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సులతో 50 పరుగులు చేసి దుమ్మురేపాడు. టిమ్ డేవిడ్ 23, జితేష్ శర్మ 10 బంతుల్లో 20 రన్స్ చేసి మంచి ఫినిష్ ఇచ్చారు. దీంతో ఆర్సీబీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ ఈ సీజన్‌లో తొలిసారి 200 ప్లస్ స్కోర్ చేసింది. ఇంత పెద్ద స్కోర్‌ను కాపాడుకోవడంలో ఆర్సీబీ బౌలర్లు ఆరంభంలో తడబడినా.. కృనాల్ పాండ్యా, జోష్ హేజల్‌వుడ్ సూపర్ బౌలింగ్‌తో రాజస్థాన్ చేతుల్లోంచి మ్యాచ్‌ను లాక్కున్నారు. ఈ మ్యాచ్ విజయంలో విరాట్ కోహ్లీ, హేజల్‌వుడ్, కృనాల్ పాండ్యా పాత్ర చాలా ఉంది. కానీ, రాజస్థాన్ ఆల్‌మోస్ట్ గెలిచేసింది అనే మూమెంట్‌లో వికెట్ కీపర్ జితేష్ శర్మ తీసుకున్న ఓ రివ్యూ మ్యాచ్‌ను ఆర్సీబీ వైపు తిప్పేసింది. 34 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులతో 47 పరుగులు చేసి.. మ్యాచ్‌ను ఈజీగా ఫినిష్ చేసేలా కనిపించాడు ఆర్ఆర్ బ్యాటర్ ధృవ్ జురెల్. భువనేశ్వర్ కుమార్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ఏకంగా 22 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్‌లో జురెల్ ఓ సిక్స్, రెండు ఫోర్లు బాదేసి.. మ్యాచ్‌ను రాజస్థాన్‌దే అని డిసైడ్ చేశాడు. అతని కొట్టుడు చూసి.. ఆర్సీబీ ఆటగాళ్ల ముఖాలు మాడిపోయాయి, భుజాలు జారిపోయాయి.. హోం గ్రౌండ్‌లో ఈ మ్యాచ్ కూడా పోయినట్టే అని అంతా అనుకున్నారు. ఆర్సీబీ అభిమానులతో నిండిపోయిన ఎర్ర సముద్రంలా మారిన చిన్నస్వామి స్టేడియంలో నిశ్శబ్ద భూతం ఆవహించింది. అలాంటి టైమ్‌లో హేజల్‌వుడ్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ మూడో బంతిని వైడ్ ఆఫ్ ది ఆఫ్ స్టంప్ యార్కర్‌గా వేశాడు. ఆ బాల్‌ను అస్సలు ఎక్స్‌పెక్ట్ చేయని జురెల్.. ఆ బాల్‌కు షాట్ ఆడలేకపోయాడు. బాల్ వెళ్లి కీపర్ జితేష్ చేతుల్లో పడింది. హమ్మయ్య డాట్ బాల్ అనుకొని.. అంతా ఊపిరి పీల్చుకున్నారు. హేజల్‌వుడ్ కూడా నెక్ట్స్ బాల్ వేసేందుకు వెనక్కి వెళ్తున్నాడు. కానీ, కీపర్ జితేష్ మాత్రం క్యాచ్ అవుట్ అంటూ అప్పీల్ చేశాడు. వీడికేమైనా పిచ్చా.. ఒక వేళ బాల్ బ్యాట్‌కు తాకినా.. గ్రౌండ్‌పై పడి ఉంటుందని ఫ్యాన్స్ అనుకున్నారు. జితేష్ అప్పీల్‌ను ఆర్సీబీ ఆటగాళ్లు కూడా సీరియస్‌గా తీసుకోలేదు. అయినా కూడా జితేష్ కెప్టెన్ రజత్ పాటిదార్‌ను ఒప్పించి రివ్యూ తీసుకునేలా చేశాడు. సరే మ్యాచ్ చివరి కి వచ్చేసింది ఎలాగో గెలిచేలా కూడా లేరు, ఉన్న రివ్యూను వేస్ట్ ఎందుకు చేయడం అంటూ తీసుకుంటున్నారులే.. అని అంతా అనుకున్నారు.కానీ, రీప్లే చూస్తే.. అందరి మైండ్ బ్లాంక్ అయిపోయింది. ఒక్కసారిగా చిన్నస్వామి స్టేడియం హోరెత్తిపోయింది. ఆ దెబ్బకు విరాట్ కోహ్లీ కూడా చెవులు మూసుకున్నాడు. ఎందుకంటే.. బాల్ స్టప్ పడిన తర్వాత బ్యాట్‌కు తాకి వికెట్ కీపర్ చేతుల్లో సేఫ్‌గా పడింది. థర్డ్ అంపైర్ అవుట్ ప్రకటించాడు అంతే.. ఆర్సీబీ జట్టులో తెలియని ఎనర్జీ వచ్చేసింది. ఆ నెక్ట్స్ బాల్‌కు ఆర్చర్ అవుట్. మ్యాచ్ ఒక్కసారిగా ఆర్సీబీ చేతుల్లోకి వచ్చేసింది. జితేష్ శర్మ ఆ రివ్యూ తీసుకోవడానికి బలవంతం చేసి ఉండకపోతే.. కచ్చితంగా ఆర్సీబీ రివ్యూ తీసుకొనేది కాదు, అంపైర్, బౌలర్, కెప్టెన్, మిగిలిన ప్లేయర్లు ఎవరూ కూడా బ్యాట్ ఎడ్జ్ తీసుకుందని అనుకోలేదు. కానీ, జితేష్ ఒక్కడే బలంగా నమ్మాడు.. రిజల్ట్ సాధించాడు. మ్యాచ్ ఆల్‌మోస్ట్ వన్‌సైడ్ అయిన తర్వాత పడిన ఆ వికెట్ ఆర్సీబీకి విజయాన్ని అందించింది. సో.. జితేష్ శర్మ ఇజ్ ది రియల్ హీరో.



# కోహ్లీ, పడిక్కల్ అర్ధసెంచరీలు

## రాజస్తాన్‌పై బెంగళూరు గెలుపు

ఐపిఎల్ సీజన్-18లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) బ్యాటర్లు మరోసారి కదం తొక్కారు. చిన్నస్వామి స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లు రాణించడంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9 వికెట్ల నష్టపోయి 194 పరుగులే చేసింది. రాజస్తాన్ బ్యాటర్లలో ధృవ్ జురెల్(47), జైస్వాల్(49) రాణించగా.. హేజిల్‌వుడ్‌కు నాలుగు, కృనాల్ పాండ్యాకు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు బెంగళూరు బ్యాటర్లు విరాట్ కోహ్లీ (70బీ 42బంతుల్లో 8ఫోర్లు, 2సిక్సర్లు), దేవ్‌దత్ పడిక్కల్ (50బీ 27 బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు) వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధ శతకాలు బాదారు. ఫిల్ సాల్ట్ (26బీ 23బంతుల్లో 4ఫోర్లు), జితేశ్ శర్మ (20నాటౌట్), టిమ్ డేవిడ్ (23) పరుగులు చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు సాల్ట్, కోహ్లీ శుభారంభం అందించారు. ఈ జోడీ నిలకడగా బౌండరీలు బాది తొలి వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మొదటి రెండు ఓవర్లలో చెరో ఫోర్ బాదగా.. ఆర్చర్ వేసిన మూడో ఓవర్‌లో కోహ్లీ వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఫిల్ సాల్ట్ తుషార్ దేశ్‌పాండేకు వరుసగా రెండు బౌండరీలతో స్వాగతం పలికాడు. ఈ క్రమంలో పవర్ ప్లే ముగిసేసరికి బెంగళూరు జట్టు వికెట్లేమీ నష్టపోకుండంఅ 58పరుగులు చేసింది. తర్వాత బంతి అందుకున్న హసరంగ తన తొలి ఓవర్‌లో ఫిల్ సాల్ట్‌ను వెనక్కి పంపి మూడే పరుగులు ఇచ్చాడు. అనంతరం పడిక్కల్‌తో కలిసి కోహ్లీ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సందీప్ బౌలింగ్‌లో విరాట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లీకిది ఐదో అర్ధ శతకం. ఆ తర్వాత విరాట్, పడిక్కల్ జోరు పెంచారు. పరాగ్ బౌలింగ్ చెరో సిక్స్ రాబట్టారు. తుషార్ దేశ్‌పాండే వేసిన 15 ఓవర్‌లో పడిక్కల్ రెండు సిక్స్‌లు కొట్టి 26 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో కోహ్లీ ఒక సిక్స్ బాదాడు. దీంతో 15 ఓవర్లకు బెంగళూరు వికెట్ నష్టానికి 156 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, స్వల్ప వ్యవధిలో బెంగళూరు మూడు వికెట్లు కోల్పోయింది. కోహ్లీని ఆర్చర్ ఔట్ చేయగా.. సందీప్ ఒకే ఓవర్‌లో పడిక్కల్, రజత్ పటీదార్ (1)ని వెనక్కి పంపాడు. చివరి మూడు ఓవర్లలో ఆర్సీబీ 38 పరుగులు రాబట్టింది. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ, జోఫ్రా ఆర్చర్, హసరంగ చెరో వికెట్ పడగొట్టారు.

# పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడబోము

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులోనూ పాకిస్తాన్ క్రికెట్ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోమని ప్రకటించింది. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో బిసిసిఐ గురువారం కీలక ప్రకటన విడుదల చేసింది. బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడే అంశం గురించి సమీప భవిష్యత్తులో కనీసం చర్చ కూడా ఉండదు. అయితే, ఐసిసి ఈవెంట్లలో మాత్రం నిబంధనలకు అనుగుణంగా పాకిస్తాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడుతుంది" అని తెలిపారు. ఇక దేవజిత్ సైకియా స్పందిస్తూ.. బిసిసిఐ తరఫున ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాం అని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఐపిఎల్-2025లో భాగంగా బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్-ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ బాధితులకు నివాళి అర్పించింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## ముహూర్తానికి వచ్చి.. హీరోయిన్‌గా ఫిక్స్ చేసి..



టాలీవుడ్లో కొత్త వాళ్లను బాగా ఎంకరేజ్ చేసే వాళ్ళలో నాని ఒకడు. అతను ఎక్కువగా కొత్త, అప్‌కమింగ్ డైరెక్టర్లతోనే సినిమాలు చేస్తుంటాడు. హీరోయిన్లు, మిగతా ఆర్టిస్టులు, టెక్నీషియన్లను కూడా కొత్త వాళ్లనే పరిచయం చేస్తుంటాడు. అతను హీరోయిన్లను రిపీట్ చేయడం తక్కువ. నాని కొత్త చిత్రం 'హిట్-3'లో కన్నడ అమ్మాయి, కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోంది. ఆమెతో నాని జత కట్టడం ఇదే తొలిసారి. శ్రీనిధిని 'హిట్-3'కి ఎంపిక చేసింది దర్శకుడు శైలేష్ కొలను కాదట. నానినే స్వయంగా ఆమెకు ఛాన్స్ ఇచ్చాడట. అది అనుకోకుండా జరిగిందని స్వయంగా హీరోయిన్ శ్రీనిధినే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. తాను తెలుగులో కథానాయికగా నటించిన తొలి చిత్రం 'తెలుసు కదా' ముహూర్త వేడుకకు వచ్చిన నాని.. తనకు ఛాన్స్ ఇచ్చినట్లు శ్రీనిధి తెలిపింది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న సినిమా 'తెలుసు కదా'. ఇందులో శ్రీనిధితో పాటు రాశి ఖన్నా కూడా కథానాయికగా నటిస్తోంది. నీరజకు నాని క్లోజ్ ఫ్రెండ్ కావడంతో ఆమె దర్శకురాలిగా పరిచయం అవుతున్న చిత్రం ముహూర్త వేడుకకు నాని ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఆ సందర్భంగా శ్రీనిధిని చూసి, మాట్లాడిన నాని.. తన పక్కన ఆమె మంచి పెయిర్ అవుతుందని భావించాడట. తర్వాత 'హిట్-3' మొదలు కాగానే ఆమెకే తన పక్కన హీరోయిన్‌గా ఛాన్స్ ఇచ్చాడట. ఇలా అనుకోకుండా తాను 'హిట్-3'లో భాగం అయ్యానని శ్రీనిధి చెప్పింది. విశేషం ఏంటంటే.. నాని ఏ సినిమా ముహూర్త వేడుకకు వెళ్లి శ్రీనిధిని తన చిత్రంలోకి తీసుకున్నాడో ఆ సినిమా ఇంకా విడుదలకు సిద్ధం కాలేదు. కానీ 'హిట్-3' ఈ లోపే పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చేస్తోంది. మరి 'హిట్-3' శ్రీనిధికి తెలుగులో ఎలాంటి ఆరంభాన్నిస్తుందో చూడాలి. ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే.

## పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన ప్రకాష్‌రాజ్

పహల్గాం దాడిని ఖండిస్తున్నామని, రక్తం మరిగిపోతుందని సినీనటుడు ప్రకాష్‌రాజ్ పేర్కొన్నారు. ఈ ఘటనతో ప్రతి కాశ్మీరీ గుండె ముక్కలైందని, మాటలు రావడం లేదన్నారు. కాశ్మీరీలు మౌనం వీడాల్సిన సమయమిదని, ఈ క్రూరమైన చర్యను ఖండించాల్సిందేనని ఎక్స్‌లో గురువారం పేర్కొన్నారు" ఈ అనాగరిక దాడి అమాయకులపై జరిగిన దాడి మాత్రమే కాదు, కాశ్మీర్‌పై దాడి. శతాబ్దాల సంప్రదాయాలకు జరిగిన అవమానం. మన విశ్వాసాన్ని దెబ్బతీసేలా దుష్ట ప్రయోజనాల కోసం చేసిన దారుణచర్య. ఈ దుశ్చర్యకు మా రక్తం మరిగిపోతోంది. ఇలాంటివి జరిగిన ప్రతిసారీ, చేయని పనికి అవమాన భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ విషయంలో మరోసారి నిస్సందేహంగా చెబుతున్నా. దీనిని అస్సలు క్షమించం.. ఇది నిజంగా భయంకరమైన చర్య. అంతకుమించి పిరికిపంద చర్య. మన ఇంటికి వచ్చిన అతిథులపై జరిగిన ఈ క్రూర చర్యకు నిజంగా సిగ్గుపడుతున్నాం. దయచేసి మమ్మల్ని ఈ దృష్టి నుండి మాత్రం చూడొద్దని వేడుకుంటున్నా. ఇది నిజమైన కాశ్మీరీలు చేసింది కాదు.మా తల్లిదండ్రులు హంతకులను పెంచి పోషించలేదు. ఇది సిగ్గుపడాల్సిన అంశం. మీరు ఏం ఆశించి ఇటువంటి దారుణ హింసకు పాల్పడ్డారో తెలియదు. మీ చర్య కొన్ని కుటుంబాలను నాశనం చేసింది. పిల్లలను అనాథలుగా మార్చింది. కాశ్మీర్ ఆట స్థలం కాదు. యుద్ధం క్షేత్రం అంతకన్నా కాదు. అతిథులకు స్వాగతం పలికే ప్రదేశం. మీరు కశ్మీర్‌లో ప్రశాంతంగా ఉండటానికి వచ్చారు. కానీ, మేము మిమ్మల్ని కాపాడలేకపోయాం. అందుకు క్షమించమని అడుగుతున్నాం" అని పోస్ట్‌లో పేర్కొన్నారు.





## సీతని మిస్ చేసుకున్న హిట్ 3 భామ

ప్రతి అన్నం మెతుకు మీద తినేవాడి పేరు రాసి ఉంటుందని పెద్దలు ఊరికే అనలేదు. ఇది సినిమా పరిశ్రమకు కూడా వర్తిస్తుంది. బాలీవుడ్ చరిత్రలోనే బిగ్గెస్ట్ గ్రాండియర్ గా తెరకెక్కుతున్న రామాయణలో సీతగా సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పాత్ర కోసం కెజిఎఫ్, హిట్ 3 భామ శ్రీనిధి శెట్టి కూడా ఆడిషన్ కు వెళ్ళింది. రెండు మూడు సీన్లను ప్రాక్టీస్ చేసి మరీ అందులో పాల్గొంది. తనతో పాటు అలియా భట్ ని సైతం పరిశీలించారు. కానీ చివరికది సాయిపల్లవిని వరించింది. అందం కన్నా పెర్ఫార్మన్స్ డిమాండ్ చేసే క్యారెక్టర్ కావడంతో దర్శకుడు నితేశ్ తివారి తెలివైన నిర్ణయం తీసుకున్నారు.ఇదంతా కెజిఎఫ్ 2 విడుదల టైంలో జరిగింది. రావణుడిగా యష్ చేయొచ్చనే విషయం శ్రీనిధికి అప్పుడే తెలిసింది. ఒకవేళ రామాయణ కనక తనను వరిస్తే కెజిఎఫ్ జంట ఇప్పుడు శత్రువుల్లా నటించాల్సి వస్తుందని ఊహించుకుని ఆనందపడింది. కానీ బ్యాడ్ లక్ అవకాశం వేరొకరికి వెళ్ళిపోయింది. ఇదంతా ఒక హిందీ ఇంటర్వ్యూలో శ్రీనిధి చెప్పింది. ఇండస్ట్రీ హిట్ కొట్టిన కెజిఎఫ్ తర్వాత శ్రీనిధి శెట్టి కెరీర్ ఆశించినంత వేగంగా వెళ్లడం లేదు. నానితో జట్టు కట్టిన హిట్ 3 ది థర్డ్ కేస్ తో పాటు సిద్దు జొన్నలగడ్డ తెలుసు కదా పెద్ద బ్రేక్ ఇస్తుందనే నమ్మకంతో ఉంది. దానికి తగ్గట్టే ప్రమోషన్లలో హుషారుగా పాల్గొంటోంది. నానితో పాటే ఉంటూ ముంబై నుంచి కోచి దాకా పబ్లిసిటీలో భాగమవుతున్న శ్రీనిధి శెట్టికి హిట్ 3 సక్సెస్ కావడం చాలా కీలకం. అమ్మడి హుషారు చూస్తుంటే ప్రాధాన్యం బాగానే ఇచ్చినట్టు ఉన్నారు.

## ఆ సినిమాపై నిషేధం



పాకిస్థానీ నటుడు ఫవాద్ ఖాన్ నటించిన బాలీవుడ్ చిత్రం అబిర్ గులాల్‌పై నిషేధం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది. 'ఈ నిషేధానికి ప్రధాన కారణం, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి' అని పేర్కొన్నారు. ఫవాద్ ఖాన్ గతంలో ఖూబ్సూరత్ (2014), కపూర్ అండ్ సన్స్ (2016), ఏ దిల్ హై ముష్కిల్ (2016) వంటి బాలీవుడ్ చిత్రాల్లో నటించి భారత ప్రేక్షకుల్లో ప్రజాదరణ పొందారు. 2016లో 'ఏ దిల్ హై ముష్కిల్' చిత్రం విడుదల సమయంలో కూడా ఈ వివాదం రేగింది. సినిమా ఓనర్స్ అండ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ చిత్రాన్ని మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, గోవాలోని సింగిల్-స్క్రీన్ థియేటర్లలో ప్రదర్శించకూడదని నిర్ణయించింది. అప్పుడు జరిగిన ఉరి దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సంబంధాలు దిగజారడం దానికి కారణం. 2023లో బొంబాయి హైకోర్టు పాకిస్థానీ కళాకారులపై నిషేధాన్ని అధికారికంగా విధించేందుకు దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది, సాంస్కృతిక సామరస్యం, శాంతిని ప్రోత్సహించడం ముఖ్యమని తీర్పులో పేర్కొంది.

## రజినీ కోసం రాసిన స్టోరీని మార్చి

తమిళ స్టార్ హీరో సూర్యకు ఎంతో కీలకమైన సినిమా.. రెట్రో. కొన్నేళ్లుగా అతడికి విజయాలు లేవు. తన చివరి చిత్రం 'కంగువ' కెరీర్లోనే పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందని అనుకుంటే.. అతి పెద్ద డిజాస్టర్లలో ఒకటిగా నిలిచింది. దీంతో యువ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్ట్ చేసిన 'రెట్రో' మీద తన ఆశలన్నీ పెట్టుకున్నాడు సూర్య. ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీని టీజర్, ట్రైలర్ చూస్తే.. సూర్యకు పర్ఫెక్ట్ సినిమా అని, అతడికి కమ్ బ్యాక్ ఫిలిం అవుతుందనే అంచనాలు కలిగాయి. ఐతే ఈ కథ నిజానికి సూర్య కోసం రాసిందే కాదట. ఇంతకుముందు సూపర్ స్టార్ రజినీకాంత్‌తో 'పేట' మూవీ చేసిన కార్తీక్.. మళ్లీ ఆయన కోసమే రాసిన కథనే 'రెట్రో' అట. కానీ కొన్ని కారణాలతో ఈ సినిమాను ఆయనతో చేయలేకపోయానని.. సూర్యతో చేశానని.. కానీ ఆయన వచ్చాక చాలా మార్పులు జరిగాయని ఓ ఇంటర్వ్యూలో కార్తీక్ వెల్లడించాడు. రజినీ కోసం కథ రాసినపుడు అది పూర్తిగా యాక్షన్ ప్రధానంగా ఉందట. రజినీ వయసు దృష్ట్యా ఆయనకు లవ్ స్టోరీ, రొమాంటిక్ ట్రాక్ పెడితే బాగుండదని.. కాబట్టే యాక్షన్ కథగా దాన్ని తీర్చిదిద్దానని కార్తీక్ తెలిపాడు. ఐతే సూర్యతో ఈ కథ చేయాలి అనుకున్నాక.. యాక్షన్ డోస్ తగ్గించి ఇందులోకి ప్రేమకథను తీసుకొచ్చానని కార్తీక్ తెలిపాడు. ఈ కథను ముందు రజినీకి చెప్పావా అని సూర్య అడిగాడని.. ఔనని బదులిచ్చానని కార్తీక్ వెల్లడించాడు. 'రెట్రో' అందరూ అనుకుంటున్నట్లు గ్యాంగ్‌స్టర్ స్టోరీ కాదని అతను స్పష్టం చేశాడు. ఇందులో ప్రేమకథే ప్రధానమని.. దాని చుట్టూ మిగతా అంశాలను చేర్చానని.. ప్రేక్షకులు ఊహించని విధంగా ఈ కథ సాగుతుందని కార్తీక్ తెలిపాడు. సూర్య సరసన పూజా హెగ్డే కథానాయికగా నటించిన ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్ ఆస్థాన సంగీత దర్శకుడైన సంతోష్ నారాయణన్ మ్యూజిక్ చేశాడు. తమిళ, తెలుగు భాషల్లో ఒకేసారి ఈ చిత్రం విడుదల కానుంది.



## కార్తికేయ 'మెగా' కల నెరవేరబోతోందా ?



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో రూపొందబోయే భారీ ఎంటర్ టైనర్ త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లనుంది. ఇటీవలే పూజా కార్యక్రమాలతో మెగా 157 లాంచ్ చేసిన సంగతి తెలిసిందే. క్యాస్టింగ్ కు సంబంధించిన పనుల్లో అనిల్ బిజీగా ఉన్నాడు. విలన్ గా ఎవరిని తీసుకోవాలనే దాని మీద తర్జన భర్జనలు జరుగుతున్నాయట. ఆరెక్స్ 100 హీరో కార్తికేయని మంచి ఆప్షన్ గా భావిస్తున్నట్టు లేటెస్ట్ లీక్. గతంలో తను అజిత్ వలిమై, నాని గ్యాంగ్ లీడర్ లో ప్రతినాయకుడిగా మెప్పించాడు. కాకపోతే ఆ రెండూ పెద్ద స్థాయిలో బ్లాక్ బస్టర్లు కాలేదు కానీ కంటెంట్ పరంగా పేరు తీసుకొచ్చాయి.హీరోగా బాగా స్ట్రగుల్ అవుతున్న కార్తికేయకు సక్సెస్ రేట్ తక్కువగా ఉంది. ఇన్నేళ్ల కెరీర్ లో పట్టుమని అయిదు హిట్లు లేకపోవడం కెరీర్ మీద ప్రభావం చూపిస్తోంది. బెదురులంక 2012 ఓ మోస్తరుగా బాగానే ఆడినప్పటికీ పెద్ద బ్రేక్ అయితే దక్కలేదు. ఈ నేపథ్యంలో తాను విపరీతంగా అభిమానించే చిరంజీవి సినిమాలో భాగం అంటే క్షణమైనా ఆలోచించకపోవచ్చు. పైగా అనిల్ రావిపూడి విలన్లు భీకరంగా ఉండరు. కాస్త ఫన్ టచ్ కూడా ఉంటుంది. అజిత్ తో నటించడం ద్వారా ఒక కలను నెరవేర్చుకున్న కార్తికేయ ఇప్పుడు జీవిత లక్ష్యమైన మెగా మూవీలో చిరు పక్కన కనిపించడం నెరవేరితే అంతకన్నా ఏం కావాలి. ప్రస్తుతానికి ఇది లీక్ కాబట్టి అధికారిక ముద్ర వచ్చే దాకా ఫ్యాన్స్ వెయిట్ చేయాల్సి ఉంటుంది. విశ్వంభర ప్రమోషన్లు త్వరలోనే మొదలుపెట్టబోతున్న నేపథ్యంలో చిరంజీవి వాటికి అవసరమైన డేట్లు మినహాయించి అనిల్ రావిపూడికి నాన్ స్టాప్ గా రెండు నెలలు కాల్ షీట్స్ ఇస్తారని సమాచారం. హీరోయిన్ తదితర వివరాలకు సంబందించిన సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. 2026 సంక్రాంతి విడుదలని లాక్ చేసుకోవడంతో దానికి అనుగుణంగానే షెడ్యూల్స్ ఉండబోతున్నాయి. చిరంజీవి రా ఆఫీసర్ గా కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది కానీ అది ఉత్తిదేనని యూనిట్ మాట. చూడాలి మరి కార్తికేయ న్యూస్ నిజమవుతుందో లేదో.

## అనుష్క దర్శనం ఎప్పుడంటే..



మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సూపర్ హిట్ తర్వాత కనిపించకుండా పోయిన అనుష్క శెట్టి అనుకున్న ప్రకారం అన్నీ జరిగి ఉంటే ఈ ఏప్రిల్ లోనే ఘాటీతో పలకరించేది. అయితే పోస్ట్ ప్రొడక్షన్ లో జరుగుతున్న ఆలస్యం, పెండింగ్ ఉన్న ప్యాచ్ వర్క్ వల్ల ఇంకా కొత్త డేట్ నిర్ణయించుకోలేదు. మరి ఎప్పుడు విడుదలనేది దర్శకుడు క్రిష్, నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ ఎక్కడా చెప్పడం లేదు. ఇదిలా ఉండగా ఈ సంవత్సరం అనుష్క మొత్తం రెండు సినిమాల్లో దర్శనమివ్వనుంది. ఘాటీ తర్వాత మలయాళంలో చేసిన విజువల్ గ్రాండియర్ కథనర్ పార్ట్ 1 ఇదే ఏడాది ప్యాన్ ఇండియా భాషల్లో థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఇక్కడితో అయిపోలేదు. కథనర్ రెండు భాగాలుగా తీస్తున్నారు. 2026లో సీక్వెల్ వస్తుంది. తొమ్మిదో శతాబ్దానికి చెందిన కడమత్తాత్తు కథనర్ అనే క్రైస్తవ పూజారి కథ ఆధారంగా భారీ బడ్జెట్ తో ఇది రూపొందుతోంది. కాళీయన్ కట్టు నీలిగా అనుష్కకు చాలా ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కింది. ఇదిలా ఉండగా భాగమతి 2 చేయాలనే ప్లానింగ్ లో యువి సంస్థ ఉంది. కాకపోతే స్వీటీ డేట్లు ఎంత వరకు అందుబాటులో ఉంటాయనే దాన్ని బట్టి నిర్ణయం తీసుకోబోతోంది. ఇవి కాకుండా తెలుగులో ఒకటి, తమిళంలో మరొక సినిమాకు అనుష్క సానుకూలంగా స్పందించినట్టు వార్తలు ఉన్న నేపథ్యంలో ఇంకా కన్ఫర్మేషన్ రావాల్సి ఉంది. ఇదంతా ఎలా ఉన్నా అనుష్క ఇంత గ్యాప్ తీసుకోవడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్పీడ్ పెంచాలనేది వాళ్ళ డిమాండ్. అన్నట్టు ప్రభాస్ తో ఆమె మరోసారి జోడి కట్టొచ్చని, హొంబాలే సంస్థతో డార్లింగ్ చేసుకున్న మూడు ప్రాజెక్టుల్లో ఒకదానికి స్వీటీనే హీరోయిననే ప్రచారం జరుగుతోంది కానీ అనౌన్స్ మెంట్ వచ్చే దాకా నమ్మే అవకాశం లేని గాసిప్ ఇది. సినిమాల సంగతి పక్కనపెడితే త్వరలో అనుష్క పెళ్లి జరగాలని కోరుకుంటున్న ఫ్యాన్స్ అభిమతం ఎప్పుడు తీరుతుందో అంతు చిక్కడం లేదు. పుకార్ల వలయంలో వార్తలు చక్కర్లు కొట్టడం మినహాయించి నిజంగా మిసెస్ అనుష్క ఎప్పుడవుతుందో వేచి చూడాలి.